


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

24.09.2026
గురువారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 133
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## ఈసీలో తీవ్ర విభేదాలు

- జ్ఞానేష్ కుమార్‌పై..
- విపక్షాలు, సీజేపీ మండిపాటు
- ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో..
- ఇద్దరిని సంప్రదించకుండానే నిర్ణయాలు




**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

ఈసీ నిర్ణయాలపై తీవ్ర దుమారం రేగుతోంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో పాటు పలు కీలక అంశాల్లో తమకు సమాచారం ఇవ్వకుండా చీకటిలో ఉంచారని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఫిర్యాదు చేసినట్లు వచ్చిన మీడియా నివేదిక సంచలనం సృష్టిస్తోంది. ఈ కథనం ఆధారంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే, అధికార ప్రతి నిధి సౌరభ్ దాస్ సోషల్ మీడియా వేదికగా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 2లో..

## రాష్ట్రాల వారీగా బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌లు

- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు
- ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌ల నియామకం
- స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు

7లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23, అనంతజనశక్తి న్యూస్**

బీజేపీలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, కోఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ బుధవారం ఈ నియామకాలను ప్రకటించారు. అందులో భాగంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు అప్పగించారు.

## 'స్థానిక' ఎన్నికలు వాయిదా పడవు

- క్లారిటీ ఇచ్చిన మంత్రి లోకేష్.!
- అక్టోబర్ లోనే స్థానిక ఎన్నికలు
- ఎవరికీ ఎలాంటి అపోహలు అక్కర్లేదు
- ప్రచారంలో ఇసుమంతైనా వాస్తవం లేదు

2లో..



## ఆంధ్రప్రదేశ్‌లో 4 కొత్త కమిషనరేట్లు




- రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా
- కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- సాగునీటి ప్రాజెక్టులు, శాంతిభద్రతల పరిరక్షణ
- రాజధాని అమరావతి అభివృద్ధియే లక్ష్యంగా
- అమరావతి పరిధిలోని గ్రామాల్లో..
- రూ.1,548 కోట్లతో మౌలిక వసతులు
- అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా
- రూ.644.98 కోట్లు మంజూరు

2లో..

**అమరావతి, సెప్టెంబర్ 23, అనంతజనశక్తి న్యూస్**

ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో పలు కీలక అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు పోలీస్ కమిషనరేట్లు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి ఇన్‌ఫ్రా పనులకు అదనంగా రూ.644.98 కోట్లు, అసెంబ్లీ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ పనులకు రూ.661 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఎల్‌పీఎస్ రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా పరిరక్షించేందుకు, పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా నాలుగు ప్రధాన నగరాల్లో కొత్తగా పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయడానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, కర్నూలులో కొత్తగా కమిషనరేట్లు ఏర్పాటు కావడం వల్ల నేరాల నియంత్రణ సులువవ్వడంతో పాటు ప్రజలకు పోలీసు సేవలు మరింత వేగంగా అందుతాయని మంత్రివర్గం అభిప్రాయపడింది. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ భారీగా నిధులు కేటాయించింది.



## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు క్యాష్ రివార్డులు

- ప్రభుత్వ పథకాల ప్రచారానికి సరికొత్త రూట్
- ఇన్‌ఫ్లుయెన్సర్‌కి వారికుండే ఫాలోవర్స్
- రీచ్‌ని బట్టి కేటగిరీల వారీగా రివార్డులు
- రూ.5 వేల నుంచి రూ.15000 వరకు
- మంత్రి పార్థసారధి వెల్లడి

2లో..



## హుండీ కానుకలు రూ.28.94 కోట్లు

- శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- 33 లక్షల లడ్డూల విక్రయం
- 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులు
- టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు వెల్లడి



2లో..

## మూడు మోటార్లు నడుపుతున్నారు

- అది కూడా బీఆర్ఎస్ ఒత్తిడి చేస్తేనే..
- మాజీ మంత్రి హరీశ్ రావు
- ఏపీలోనేమో క్రాప్ హాలీడే లేదు
- తెలంగాణలో మాత్రం క్రాప్ హాలీడే
- దీనిక్కారణం నీళ్లు లేక కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం

7లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన చేతకాక నీటి నిర్వహణలో వైఫల్యం చెంది ఈ రోజు ఎల్‌నినో పేరు చెప్పి తప్పించుకుంటున్నరు. నిజంగా చెప్పాలంటే ఈ రాష్ట్రంలో ఎల్‌నినో కాదు కరువు.. కాంగ్రెస్ వల్ల కరువు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. పక్క రాష్ట్రంలో ఎక్కడా క్రాప్ హాలీడే లేదు. కానీ తెలంగాణకు మాత్రం క్రాప్ హాలీడే ప్రకటించారు. 2 రాష్ట్రాలకు అదే కృష్ణా, గోదావరి నదులు.. ఏపీలోనేమో క్రాప్ హాలీడే లేదు.. తెలంగాణలో మాత్రం క్రాప్ హాలీడే. దీనిక్కారణం నీళ్లు లేక కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం.. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాకనే ఈ రోజు ఈ రాష్ట్రంలో కరువుపరిస్థితుల వల్ల రైతాంగం కన్నీళ్లు పెడుతున్నటు వంటి పరిస్థితి.

## శ్రీకాకుళంలో ఘోర రైలు ప్రమాదం

- ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని..
- నలుగురు హాస్టల్ విద్యార్థులు దుర్మరణం



2లో..

## జూరాల నుంచి నీటి విడుదల

- కర్ణాటక సీఎంతో పాలమూరు మంత్రుల చర్చలు
- జూరాల, భీమా ప్రాజెక్టుల పరిధిలో..
- పంటలను కాపాడేందుకు కృష్ణా నీటి విడుదల

2లో..



**బెంగళూరు, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిధిలో ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దిగువన ఉన్న ఎండబెట్టిన ఎకరాలకు జీవం పోసేందుకు కృష్ణా నదీ జలాలను విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం కర్ణాటక ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. ఈ మేరకు మంగళవారం బెంగళూరులో కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో ప్రజాప్రతినిధుల బృందం భేటీ అయింది.

## 2 డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- నెలాఖరు నాటికి పీఆర్సీ నివేదిక!
- క్యాబినెట్ స్థాయి మార్గదర్శకాలకు అనుగుణంగా
- ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సానుకూలం

2లో..

## ఇంటి వద్దకే మీసేవ సర్వీసులు

- మీసేవ డోర్ డెలివరీ ప్రారంభం
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

2లో..

- ఆధార్‌కు సంబంధించిన కొన్ని సేవలు
- రిజిస్ట్రేషన్, పోలీస్ శాఖకు చెందిన సేవలు
- సర్వీసులను పొందేందుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్
- మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలి

# 'స్థానిక' ఎన్నికలు వాయిదా పడవు

**అమరావతి, సెప్టెంబర్ 23, అనంతజనశక్తి న్యూస్**

ఏపీ స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయంపై మంత్రి నారా లోకేష్ క్లారిటీ ఇచ్చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో స్థానిక ఎన్నికలపై చర్చ జోరుగా సాగుతున్న సంగతి తెలిసిందే. అక్టోబర్, నవంబర్, లేదా తరువాతా అన్న ఉత్కంఠకు తెరదించుతూ మంత్రి నారా లోకేష్ వచ్చే నెలలోనే అంటే అక్టోబర్ లోనే స్థానిక సమరం ఉంటుందన్న స్పష్టత ఇచ్చారు. ఎన్నికలు వాయిదా పడతాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఇసుమంతైనా వాస్తవం లేదని.. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అపోహలు అక్కర్లేదని తేల్చిచెప్పారు.
మంత్రులు, పార్టీ కీలక నేతల ఉన్నతస్థాయి భేటీలో నారా లోకేశ్ స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం కూటమి క్లీన్ స్వీప్ చేయాలని, అందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను స్థానిక సమరానికి పూర్తి స్థాయిలో సమాయత్తమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి స్థానిక ఎన్నికలు కీలకమన్నారు నారా లోకేష్. గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా, పారదర్శకమైన పాలనను అందిస్తూ ప్రజల మద్దతు ఉంటున్న కూటమి శ్రేణులు ఈ ఎన్నికల్లో తిరుగులేని విజయాలను నమోదు చేయాలని పిలుపునిచ్చారు. కేవలం విజయం సాధించడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేయాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో కూటమి అభ్యర్థుల విజయం కోసం నాయకులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు.

**లోకేష్ అహ్మదాబాద్ పర్యటన!**

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రేపు అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లనున్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను వివరించే లక్ష్యంతో ఈ పర్యటన కొనసాగనుంది. ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ బుధవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే 'ఫ్యూచర్ చాట్' కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు.
అనంతరం గురువారం రాత్రి అహ్మదాబాద్ చేరుకోనున్నారు. శుక్రవారం అహ్మదాబాద్‌లో జరిగే నేబిజ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026లో భాగంగా నిర్వహించే రోడ్‌షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ రోడ్‌షోను నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, వివిధ రంగాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పెట్టుబడిదారులకు వివరించనున్నారు. ముఖ్యంగా పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, తయారీ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై రోడ్‌షోలో దృష్టి సారించనున్నట్లు సమాచారం.
పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ విధానాలను వారికి వివరించనున్నారు. గుజరాత్ పారిశ్రామిక రంగానికి కీలక కేంద్రంగా ఉన్న నేపథ్యంలో అహ్మదాబాద్ రోడ్‌షోకు ప్రాధాన్యత ఏర్పడింది. గుజరాత్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తలను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా ఉపయోగించుకోనున్నారు.

# 2 డీఏల విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం విడుదల, వేతన సవరణ నివేదికపై తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ చర్చల అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అంగీకరించినట్లు ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేశారు. క్యాబినెట్ స్థాయి మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రెండు డీఏల ప్రకటనకు ఆమోదం తెలిపింది. మొదటి డీఏ 3.46 శాతం చొప్పున విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రెండో డీఏ 2.74 శాతం చొప్పున ఇచ్చేందుకు అంగీకరించింది. ఉద్యోగ సంఘాల నాయకులు మొత్తం మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరినప్పటికీ, ప్రభుత్వం రెండు డీఏలకు తక్షణ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగిలిన మూడో డీఏను రాబోయే 3 నుండి 4 నెలల వ్యవధిలో విడుదల చేస్తామని ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించింది.

# ఈసీలో తీవ్ర విభేదాలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను 'భారత శత్రువు'గా అభివర్ణిస్తూ అభిజీత్ దిప్కే ఎక్స్ వేదికగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఓటర్ల జాబితా నుంచి దాదాపు 12 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఇది 2024 లోక్‌సభ ఎన్నికల్లో నమోదైన 97 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 12.4 శాతానికి సమానం. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు, ప్రతిపక్షాలకు మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 2 శాతం మాత్రమే. జ్ఞానేష్ కుమార్ ఎన్నికలను నిర్వహించడం లేదు, స్వయంగా స్క్రిప్ట్ రాస్తున్నారు" అని దిప్కే ఆరోపించారు. మరోవైపు, సీజేపీ అధికార ప్రతినిధి సౌరభ్ దాస్ ఒక వీడియోను షేర్ చేస్తూ.. "జ్ఞానేష్ బ్రో.. ఇది ముగిసింది. భారత ఎన్నికల సంఘం పారదర్శకతను కోల్పోయింది. మన ఓట్లను, ఓటు హక్కును దొంగిలిస్తున్నారు" అని విమర్శించారు.
ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రచురించిన దర్యాప్తు కథనం ప్రకారం.. కేంద్ర ఎన్నికల సంఘంలో తీవ్ర అంతర్గత విభేదాలు ఉన్నాయి. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గడిచిన 10 నెలల కాలంలో సీఈసీ తీసుకున్న నిర్ణయాలపై కనీసం 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలను నమోదు చేశారు. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) డ్రైవ్‌లో దాదాపు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించారు. ఫారమ్ 6లో చేసిన మార్పులపై కూడా ఈ ఇద్దరు కమిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్త ఓటర్లు తమ లేదా తమ తల్లిదండ్రుల, తాతముత్తాతల పేర్లు 'గత ఎస్ఐఆర్' ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో తెలపాలనే నిబంధనను అనుమతి లేకుండా చేర్చారని, ఇది తొలిసారి ఓటు వేసేవారిని వేధించడమే అవుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా, ఓటర్ల జాబితా నిర్వహణ వ్యవస్థ 'ఈఆర్‌వోనెట్' కేంద్రీకరణ నిర్ణయం కూడా జాబితాల పారదర్శకతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం వర్గాలు తోసిపుచ్చాయి. ఎస్ఐఆర్ ప్రక్రియతో సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలకూ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదం ఉందని స్పష్టం చేశాయి. నకిలీ, మరణించిన లేదా అనర్హులైన ఓటర్ల పేర్లను గుర్తించి తొలగించేందుకు ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించారు. గతేడాది జూన్ నెలలో బీహార్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియను ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకు విస్తరించారు. అయితే ఈ ప్రక్రియను అధికార బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా వాడుకుంటున్నారని ప్రతిపక్షాలు ఆరోపించగా, ఈసీతో

# ఇంటి వద్దకే మీసేవ సర్వీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ పౌర సేవలను మరింత సులభంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై కొన్ని ముఖ్యమైన మీసేవ సర్వీసుల కోసం ప్రజలు కేంద్రాల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా.. ఇంటి వద్దకే మీసేవ సేవలను పొందే అవకాశం కల్పించారు. 'మీసేవ డోర్ డెలివరీ సర్వీసెస్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ విధానం ద్వారా పౌరులు తమకు అవసరమైన సేవలను ఇంటి నుంచే బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం, అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
స్లాట్ బుకింగ్ పూర్తైన తర్వాత నిర్ణయించిన సమయంలో మీసేవ ఎగ్జిక్యూటివ్, ఏజెంట్ నేరుగా దరఖాస్తుదారుడి ఇంటికి వచ్చి.. అవసరమైన పత్రాలను పరిశీలించి, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన సేవలను అందిస్తారు. మీసేవ డోర్ డెలివరీ ద్వారా పలు కీలకమైన పౌర సేవలను పొందే అవకాశం ఉంది. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వాటిలో అవసరమైన మార్పులు, పిల్లల పేర్లను చేర్చడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే కులం, ఆదాయం, నివాసం, పుట్టిన తేదీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ, ఓబీసీ వంటి ధృవీకరణ పత్రాలకు సంబంధించిన సేవలను కూడా ఇంటి వద్దే పొందవచ్చు. ఇక ఆధార్‌కు సంబంధించిన కొన్ని సేవలు కూడా ఈ విధానంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. కొత్త ఆధార్ నమోదు, 5 ఏళ్లలోపు చిన్నారుల ఆధార్‌కు సంబంధించిన సేవలు, జనాభా వివరాల్లో మార్పులు, పేరు, మొబైల్ నంబర్, చిరునామా మార్పు వంటి సేవలు ఇందులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన రిజిస్ట్రేషన్ శాఖ సేవలను కూడా డోర్ డెలివరీ విధానంలో అందించనున్నారు. ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) కాపీలు, ఐజీఆర్ఎస్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్, సొసైటీ రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, ధ్రువీకరించిన ప్రతుల వంటి సేవలు ఇందులో ఉన్నాయి. పోలీస్ శాఖకు సంబంధించిన కొన్ని ధృవీకరణ సేవలను కూడా ఇంటి వద్ద నుంచే పొందే అవకాశం కల్పించారు.
దీంతో వివిధ ధృవీకరణ పత్రాల కోసం ప్రభుత్వ ఆఫీసులు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గనుంది. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగాల కారణంగా సమయం కేటాయించలేని వారికి ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంది. మీసేవ డోర్ డెలివరీ సేవలను పొందాలనుకునే వారు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తమకు కావాల్సిన సర్వీసును కస్టమర్ కేర్ ప్రతినిధికి తెలియజేయాలి. అనంతరం అందుబాటులో ఉన్న సమయాల్లో తమకు అనుకూలమైన స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు.
అదేవిధంగా అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉంది. బుకింగ్ పూర్తైన తర్వాత మీసేవ ప్రతినిధి నిర్ణయించిన సమయానికి దరఖాస్తుదారుడి చిరునామాకు చేరుకుని అవసరమైన ప్రక్రియను చేపడతారు. సేవను పొందేందుకు అవసరమైన పత్రాలు, ఇతర వివరాలను ముందుగానే సిద్ధంగా ఉంచుకుంటే.. వీలైనంత త్వరగా మీ సేవ సర్వీసులు అందనున్నాయి. డోర్ డెలివరీ సేవలను సమర్థంగా నిర్వహించేందుకు తొలి దశలో 70 మందికి పైగా మీసేవ ఏజెంట్లు, వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం, అవసరమైన పత్రాలను పరిశీలించడం, సంబంధిత సేవలను ప్రాసెస్ చేయడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు.
ప్రస్తుతం ఈ విధానాన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. తొలి దశలో వచ్చే స్పందన, ఎదురయ్యే సమస్యలు, సేవల నిర్వహణ తీరును పరిశీలించిన అనంతరం మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. పైలట్ దశలో మీసేవ డోర్ డెలివరీ విధానం విజయవంతమైతే రాష్ట్రంలోని మరిన్ని పట్టణాలు, గ్రామాలకు కూడా సేవలను విస్తరించే అవకాశం ఉంది. ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకెళ్లడం ద్వారా సమయం, ప్రయాణ ఖర్చు, కార్యాలయాల వద్ద వేచి ఉండే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

# జూరాల నుంచి నీటి విడుదల

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణలోని జూరాల, నెట్టెంపాడు, భీమా మరియు కోయిల్ సాగర్ సాగునీటి ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలో వేసిన పంటలు ప్రస్తుతం అత్యంత కీలకమైన దశకు చేరుకున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సమయంలో నీరు అందకపోతే పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని డీకే శివకుమార్‌కు వివరించారు. ఈ నాలుగు ప్రాజెక్టుల కింద సుమారు 5.5 లక్షల ఎకరాల్లో రైతులు రకరకాల పంటలు సాగు చేస్తున్నారని, ఈ పంటలను కాపాడేందుకు నెలకు 5,000 క్యూసెక్కుల చొప్పున నీటిని కర్ణాటక రిజర్వాయర్ల నుంచి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనపై డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారని ప్రతినిధుల బృందం వెల్లడించింది.
కర్ణాటకకు సరిహద్దుగా ఉన్న జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ అంశంపై రాజకీయంగానూ కాక పుట్టింది. సెప్టెంబర్ 21న ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు చేపట్టగా, సెప్టెంబర్ 22న గద్వాల జిల్లాలో బాధితులైన రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును పోలీసులు అడ్డుకుని నిలిపివేశారు.
జూరాల ప్రాజెక్టు మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 9 టీఎంసీలకు పైగా ఉందని పర్యాటక శాఖ మంత్రి జుపల్లి కృష్ణారావు తెలిపారు. అయితే అందులో సుమారు 3 టీఎంసీల మేర పూడిక పేరుకుపోగా... మరొక 3 టీఎంసీల నీటిని 2027 జూన్ చివరి వరకు తాగునీటి అవసరాల కోసం కేటాయించాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో అదనపు నీటి నిల్వ కోసం రిజర్వాయర్లు ఎందుకు నిర్మించలేదని బీఆర్ఎస్ నాయకులను మంత్రి సూటిగా ప్రశ్నించారు.

**ఫలించిన ప్రయత్నాలు...**

జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టు సాగు కోసం నీటి విడుదల ప్రారంభమైంది. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో ఇవాళ అధికారులు జూరాల ప్రధాన ఎడమ, కుడి కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు భేటీ అయి కృష్ణా జలాలపై చర్చలు జరిపిన అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు సుమారు 2,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఎగువ ప్రాంతాల నుంచి దాదాపు 2,800 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది.

# హుండీ కానుకలు రూ.28.94 కోట్లు

**తిరుమల, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అర్చక స్వాములు, అధికారులు, ఉద్యోగులు, జిల్లా, పోలీసు యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు, భక్తుల సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించామని టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు తెలిపారు. బుధవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి చైర్మన్ శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముఖ్యాంశాలను వివరించారు.
సెప్టెంబరు 15 నుంచి 22వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులకు వాహనసేవలతో పాటు శ్రీవారి మూలమూర్తి దర్శనం కల్పించినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజైన సెప్టెంబరు 15న రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారని, ఈ సందర్భంగా 2027 సంవత్సరానికి సంబంధించిన టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారని తెలిపారు.
ఎనిమిది రోజుల బ్రహ్మోత్సవాల్లో మొత్తం 5.76 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. రూ.28.94 కోట్ల హుండీ కానుకలు లభించాయి. 21.84 లక్షల అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. 2.04 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 33 లక్షల లడ్డూలు విక్రయించారు.
ఏపీఎస్ఆర్టీసీ ద్వారా తిరుపతి నుంచి తిరుమలకు 13,671 ట్రిప్పుల్లో 3,92,106 మంది, తిరుమల నుంచి తిరుపతికి 13,584 ట్రిప్పుల్లో 4,97,195 మంది భక్తులు ప్రయాణించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడసేవ రోజున తిరుమలకు విచ్చేసిన భక్తులందరికీ దర్శనం కల్పించామని చైర్మన్ తెలిపారు.
ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో పునరుద్ధరించిన శ్రీ వేంకటేశ్వర మ్యూజియం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో హీలింగ్ అండ్ డివోషన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, దుర్లభ్ దర్శన్ వీఆర్ అనుభవం, ఎలక్ట్రిక్ బస్సులు, నందకం యాప్, భక్తుల కోసం గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రారంభించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. అలాగే మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రూ.90 కోట్లతో తిరుచానూరు ఆలయానికి ఉన్న రోడ్లను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు.
అలిపిరి సమీపంలో శ్రీవారి భక్తుల సౌకర్యార్థం 50 ఎకరాల్లో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో పచ్చదనాన్ని మరింత పెంపొందించేందుకు వృక్ష గోవిందం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు.
శ్రీవారి సేవ, శ్రీవారి వైద్యసేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ ఉద్యోగుల హౌసింగ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.
వాహనసేవలకు ముందు ఇప్పటివరకు లేనివిధంగా 20 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి 295 కళాబృందాలకు చెందిన సుమారు 7,871 మంది కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. గరుడసేవ రోజున 14 రాష్ట్రాల నుంచి 32 కళాబృందాలకు చెందిన 916 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా విదేశీ కళాబృందాల ప్రదర్శనలు నిర్వహించగా, జర్మనీ, సింగపూర్ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో సుమారు 60 టన్నుల పుష్పాలు, 4 లక్షల కట్‌ఫ్లవర్స్, 80 వేల సీజనల్ ఫ్లవర్స్ వినియోగించి పుష్పాలంకరణ చేపట్టారు. తిరుమలలో చేపట్టిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాహనసేవలను భక్తులు సులభంగా వీక్షించేలా 36 భారీ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.
బ్రహ్మోత్సవాల్లో లక్షలాది మంది భక్తులకు సేవలందించేందుకు 4,000 మంది శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం 50 మంది వైద్యులు, 150 మంది పారామెడికల్ సిబ్బంది, 16 అంబులెన్సులు అందుబాటులో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించారు.
బ్రహ్మోత్సవాల సందర్భంగా 3,000 మంది పోలీసులు, 2,400 మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టారు. గరుడసేవ రోజున అదనంగా మరో 1,000 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. గరుడసేవ రోజున తిరుమలలో 3,500 మంది పారిశుద్ధ్య సిబ్బంది విశేష సేవలు అందించారు. గరుడసేవ సందర్భంగా తిరుమలలో సేకరించిన సుమారు 173 టన్నుల తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించారు. భక్తులకు మరుగుదొడ్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం శుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. తిరుపతిలోని వివిధ విభాగాలకు చెందిన సుమారు 600 మంది టీటీడీ ఉద్యోగులు గరుడసేవ సందర్భంగా విశేష సేవలందించారు.

## సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు
# క్యాష్ రివార్డులు

**అమరావతి, సెప్టెంబర్ 23, అనంతజనశక్తి న్యూస్**

ఏపీలో సరికొత్త పాలసీ రానుంది. అదే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీ. ఈ పాలసీని రూపొందించేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఏపీ మంత్రి పార్థసారథి వెల్లడించారు. ప్రభుత్వ విధానాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు విశ్వసనీయ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌స్‌ను ఎంకరేజ్ చేసే విధంగా ఈ పాలసీని రూపొందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, మౌళిక వసతుల అభివృద్ధి, ఇతర ప్రభుత్వ పథకాలు, అలాగే లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ పాలసీ ముఖ్య ఉద్దేశమని మంత్రి అన్నారు.
ఈ పాలసీ ప్రకారం సెలక్ట్ చేసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు నగదు పారితోషికం వారి వారి హ్యాండిల్స్‌కు ఉన్న ఫాలోవర్స్, వ్యూస్, ఎన్ని పోస్టింగ్‌లు చేశారనే దానిపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. వాటిని కేటగిరి వారీగా చేశామని, కేటగిరి A ప్రకారం లక్ష వ్యూస్ కంటే ఎక్కువ ఉండేవాళ్లకి రూ.15000లు, కేటగిరి Bలో ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లకు రూ.7500, కేటగిరి Cకి చెందిన వారికి రూ.5000ల చొప్పున పారితోషకం ఉంటుందన్నారు. అయితే ఇతర టర్మ్ అండ్ కండిషన్స్ కూడా ఉంటాయన్నారు. ఈ పాలసీ ఇప్పటికే గోవా, రాజస్థాన్, యూపీ, బీహార్, హిమాచల్ ప్రదేశ్‌లల్లో అమల్లో ఉందని, అయితే కొన్ని రాష్ట్రాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లకు భారీగా చెల్లింపులు చేస్తున్నారని, మన రాష్ట్రంలో అలా కాకుండా వారికుండే ఫాలోవర్లు, వ్యూస్, వారి కంటెంట్ రీచ్‌ను బట్టి వేతనం ఉంటుందని మంత్రి వెల్లడించారు. అయితే దీనికి అప్లై చేసుకునే విధి విధానాలు ఇంకా తెలియాల్సి ఉంది.
డిజిటల్ మీడియా ప్రచారానికి ఏకంగా రూ.40.20 కోట్లు
తెలుగుదేశం ప్రభుత్వం ప్రచారానికి భారీగా ఖర్చు చేస్తోంది. ఇందులో భాగంగా సోషల్, డిజిటల్ మీడియా ప్రచారానికి ఏకంగా రూ.40 కోట్లు డిజిటల్ కార్పొరేషన్‌కి కేటాయించింది. ఈ మేరకు సోషల్, డిజిటల్ మీడియా ప్రచార ఖర్చులు, సిబ్బంది వేతనాల కోసం ఏపీ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు రూ.40.20 కోట్లకు పరిపాలనపరమైన అనుమతిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**కాగా ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఇప్పటికే చంద్రబాబు, మంత్రులు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌స్‌తో మాట్లాడుతున్నారు. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి అంశాలకు సంబంధించిన వీడియోలను కూడా కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇప్పటికే పోస్టులు కూడా పెడుతున్నారు.**

**ఇతర రాష్ట్రాల్లో భారీగా చెల్లింపులు..**

అయితే ఈ పాలసీ కొత్తదేమి కాదు.. రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, గోవా, బీహార్ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ మీడియా పాలసీ ప్రకారం అక్కడ యూట్యూబర్లకు ఎక్కువగానే చెల్లిస్తున్నారు. పంజాబ్, మహారాష్ట్ర, రాజస్థాన్ ప్రభుత్వాలు కూడా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు భారీగా చెల్లింపులు చేస్తున్నాయి. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా నెలకు రూ.10 వేల నుంచి లక్షల్లో కూడా చెల్లించేలా అక్కడ రూల్స్ ఉన్నాయి. బీహార్‌లో కూడా ఆగస్ట్ 19న ఇలాంటి పాలసీని తీసుకొచ్చింది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను పోస్టు చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లకు వ్యూస్‌ను బట్టి డబ్బులు చెల్లించేలా ఈ పాలసీని రూపొందించారు. ఉదాహరణకు 30 రోజుల్లో లక్ష వ్యూస్ వచ్చిన వీడియోకు రూ.10 వేలు చెల్లిస్తారు. ఒక వీడియోకు గరిష్టంగా లక్ష రూపాయల వరకు మాత్రమే చెల్లించేలా పరిమితి విధించారు.

# శ్రీకాకుళంలో ఘోర రైలు ప్రమాదం

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 23, అనంతజనశక్తి న్యూస్**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి పరిధిలో అత్యంత తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న రైలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో విద్యార్థికి గాయాలు అయ్యాయి. మృతులంతా స్థానిక ఎస్సీ సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌కు చెందిన విద్యార్థులుగా అధికారులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.
పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి పట్టణ శివారులోని బర్మా కాలనీ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు రైల్వే ట్రాక్ వైపు వెళ్లారు. అదే సమయంలో వేగంగా వస్తున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర దాడికి నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.
ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు విద్యార్థులను పోలీసులు గుర్తించారు. విశాఖరావు, దిలీప్, శరత్, శివగా గుర్తించారు. ప్రమాదం జరిగిందనే వార్త తెలియగానే విద్యార్థుల కుటుంబసభ్యులు, బంధువులు, స్థానికులు సంఘటనా స్థలానికి భారీగా తరలివచ్చారు. కళ్లముందే చేతికి అందివచ్చిన పిల్లలు మృతదేహాలుగా పడి ఉండడంతో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి.
పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం పరీక్షల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటనతో టెక్కలి ప్రాంతమంతా తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. రైల్వే అధికారులు, పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన తీరుపై, రైలు వస్తున్న సమయంలో విద్యార్థులు గమనించకపోవడానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారు.

**సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి**

**టెక్కలి సమీపంలో రైలు ఢీకొని నలుగురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైలు ఢీకొని విశాఖరావు, దిలీప్ కుమార్, శివ, శరత్ కుమార్ అనే నలుగురు విద్యార్థులు మృతి చెందడం విషాదకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘటనపై అధికారులను అడిగి సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. రైలు రాకను గమనించలేకపోవడంతో ప్రమాదం**
**జరిగిందని అధికారులు వివరించారు. ప్రమాదంలో సాల్మన్‌రాజ్ అనే మరో విద్యార్థి గాయపడ్డారని, అతనికి ప్రస్తుతం టెక్కలి డీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సాల్మన్‌రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, మద్దతుగా నిలవాలని అధికారులను ఆదేశించారు.**

# ఆంధ్రప్రదేశ్‌లో 4 కొత్త కమిషనరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి రాజధాని పరిధిలోని గ్రామాల్లో రూ.1,548 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం లభించింది. రాజధాని మౌలిక సదుపాయాల కోసం అదనంగా రూ.644.98 కోట్లు కేటాయించారు. ప్రతిష్టాత్మక శాసనసభ భవన స్పైర్, రూఫ్, లిఫ్ట్ నిర్మాణ పనుల కోసం రూ.661 కోట్లకు ఆమోదం తెలిపారు. భూసమీకరణ కింద భూములిచ్చిన రైతులకు కనీస యాన్యుటీ చెల్లించేలా నిబంధనలలో సవరణలు చేశారు.
రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలను తీర్చే హంద్రీనీవా సుజల స్రవంతి (HNSS) ప్రాజెక్టు పురోగతిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. HNSS ఫేజ్ II మిగిలిన పనుల కోసం రూ.1,323.75 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరైన నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీనివాసపురం రిజర్వాయర్ టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, 2027 నాటికి పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. రాయచోటి నియోజకవర్గం HNSS మెయిన్ కెనాల్ 490 535 కిలోమీటర్ల మధ్య రూ.350 కోట్ల విలువైన పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు చంద్రబాబు. శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్లను హంద్రీనీవాతో అనుసంధానించి, మార్గమధ్యంలోని దాదాపు 25 వేల ఎకరాలకు పైగా ఉన్న ఖాళీ చెరువులను నీటితో నింపేలా ప్రణాళిక సిద్ధం చేశారు.ః రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. తొలిదశలో మున్సిపాలిటీలు, రెండో దశలో జెడ్పీటీసీ, మూడో దశలో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. కూటమిలోని మూడు పార్టీలు అత్యంత ఐక్యతతో పనిచేసి, అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాజకీయాల ముసుగులో నేరాలకు పాల్పడే వారిపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగళూరులో కూర్చొని రౌడీషీటర్లు, క్రిమినల్స్‌తో ప్రతిపక్ష నేత నేరాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులకు చేటు కలిగించే చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే, ఆ నష్టాన్ని సదరు వ్యక్తుల నుంచే వసూలు చేసేలా కఠినమైన చట్టం తీసుకురావాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి పంటలు వేసేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా మదనపల్లిలో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు అక్టోబర్ 2న శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు.



# విద్యార్థి ఆత్మహత్య ఘటన.. ప్రొఫెసర్‌ను సెలవుపై పంపిన ఐఐటీ బాంబే





ఐఐటీ బాంబే కు చెందిన పవయీ క్యాంపస్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విద్యార్థి ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్‌ను ఐఐటీ యాజమాన్యం సెలవులపై పంపింది. ఆత్మహత్యకు ప్రోద్బలం, ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద ఇప్పటికే పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దీంతో పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్‌గా ఉన్న ప్రొఫెసర్‌ను సోమవారం డీన్ పోస్ట్ నుంచి విద్యాసంస్థ తొలగించింది. దర్యాప్తు తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని తెలిపింది. దీంతో ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆయనను ప్రశ్నించనున్నారు.

మరోవైపు ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ.. ఐఐటీ బాంబే ఫ్యాకల్టీ ఫోరమ్ నిరసనలు కొనసాగిస్తోంది. ఆయన ఒక ఇన్విజిలేటర్‌గా తన విధులు నిర్వర్తించారని పేర్కొంది. దీనిపై ఐఐటీ బాంబే విద్యార్థి సంఘ ప్రతినిధులు స్పందిస్తూ.. ఆయన తప్పుచేసినట్లు తాము కూడా భావించడం లేదని పేర్కొన్నారు. అయితే మృతి కేసులో దర్యాప్తు జరుగుతున్నందున ఆయన్ను ఆ విధుల నుంచి పక్కనపెట్టాలని మాత్రమే కోరామని చెప్పారు. దర్యాప్తు తర్వాత మాత్రమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# సర్‌పై ఈసీలోనే అసమ్మతి అంటూ కథనాలు.. స్పష్టతనిచ్చిన ఎన్నికల సంఘం



సర్ ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం సభ్యుల మధ్యే ఏకాభిప్రాయం లేదంటూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. దీనిపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు స్పష్టతనిచ్చారు.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రస్తుతం సర్ ప్రక్రియ జరుగుతోంది. ఈ ప్రక్రియలోని వివిధ అంశాలపై ఇద్దరు కమిషనర్లు 14 సార్లు అభ్యంతరం వ్యక్తంచేశారని.. కొన్ని నిర్ణయాలపై తమకు సమాచారం ఇవ్వకుండానే అమలు చేశారని పేర్కొన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశాయి. అయితే.. ఈ కథనాలను ఈసీ అధికారులు ఖండించారు. సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సూచనలు మాత్రమే చేశారని, వాటిని ఎన్నికల సంఘం సరిదిద్దిందని చెప్పారు. నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయంతో తీసుకున్నవేనని స్పష్టం చేశారు.

# ప్రమోషన్ పోయింది..85 ఏళ్ల వయసులో పట్టా అందింది

మూడుసార్లు శత్రుమూకలతో ప్రాణాలకు తెగించి మరీ పోరాడారు లాల్‌చంద్ గోదారా. 1962, 1965, 1971 యుద్ధాల్లో పాల్గొని దేశానికి అసమాన సేవ చేశారు. అయినా విద్యార్హత లేకపోవడంతో ప్రమోషన్ ఆగిపోయింది. ఆ బాధ లాల్‌చంద్‌ని సైన్యంలో ఉన్నంతకాలం వెంటాడింది. దాంతో ఎప్పటికైనా ఉన్నత విద్యావంతుడు అనిపించుకోవాలనే పట్టుదల పెరిగింది. ఎట్టకేలకు 85 ఏళ్ల వయసులో ఆ కల నెరవేరింది. హరియాణాలోని సిర్సాకు చెందిన ఈ మాజీ సైనికుడు తాజాగా పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. ఇగ్నో నిర్వహించిన పరీక్షల్లో 1,200 మార్కులకు 965 సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. చదువులేని లోటు పూడ్చుకోవాలనే పంతంతో పదవీ విరమణ తర్వాత లాల్‌చంద్ పుస్తకం పట్టారు. 2002లో పది, 2004లో ఇంటర్, 2007లో డిగ్రీ పూర్తి చేశారు. మనవరాలు నవ్య ప్రోత్సాహంతో.. కోచింగ్, ట్యూషన్ లేకుండానే ఇంట్లోనే గంటలకొద్దీ చదివారు. పీజీ అయ్యాక కూడా ఇంతటితో ఆగిపోకుండా ఎం.ఫిల్ చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.





# డీజే చప్పుళ్లకు చిన్నారి బలి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని జిల్లా కేంద్రం బలరామ్‌పుర్‌లో రెండో తరగతి చదువుతున్న వైష్ణవి మిశ్ర అనే విద్యార్థిని తరగతి గదిలో స్పృహతప్పి పడిపోయి, కాసేపటి తర్వాత ప్రాణాలు విడిచింది. ఆ సమయంలో పాఠశాలకు సమీపంలో పెద్ద శబ్దాలతో డీజే పెట్టి, వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. బల్లపై వాలిపోయిన వైష్ణవిని ఉపాధ్యాయులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటన స్థానికుల్లో ఆగ్రహానికి దారి తీసింది. పలువురి విజ్ఞప్తి మేరకు.. పురపాలిక పరిధిలో రాబోయే పండుగలకు డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు నగరపాలిక ఛైర్మన్ ధీరేంద్ర ప్రతాప్‌సింగ్ ప్రకటించారు. ఈ కేసు విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజి పరిశీలిస్తున్నట్లు నగర సర్కిల్ అధికారి అభిషేక్ సింగ్ తెలిపారు.

# ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ.. ఆయుష్మాన్ భారత్‌పై మోదీ



ఆరోగ్యవంతమైన సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పథకం ఆయుష్మాన్ భారత్ . ఈ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆయుష్మాన్ భారత్ కింద 60 కోట్ల మంది లబ్ధిదారులు ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య బీమా రక్షణను పొందుతున్నట్లు తెలిపారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ పథకంగా నిలిచిందని కొనియాడారు. ప్రతి గడపకూ ఆరోగ్య సంరక్షణ చేరుతుండడంతో.. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు.

**48.54 కోట్ల ఆయుష్మాన్ కార్డుల జారీ..**

ఆయుష్మాన్ భారత్ పథకం గురించి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ.. ఇప్పటివరకు 48.54 కోట్ల మంది ప్రజలకు ఆయుష్మాన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 39 వేలకు పైగా నమోదిత ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన వైద్య సేవలు అందించామన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల భారం సామాన్య ప్రజలపై పడకుండా ఉండేందుకు.. సకాలంలో చికిత్స పొందేందుకు వీలుగా ప్రధాని మోదీ దార్శనికతతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 2018లో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఝార్ఖండ్‌లో ప్రారంభించారు.

# పట్టపగలే నిలువు దోపిడీ క్యాన్సర్ ఔషధాల అధిక ధరలపై సుప్రీం



దిల్లీ: క్యాన్సర్ చికిత్సకు వినియోగించే కీలక ఔషధాలను అధిక ధరలకు విక్రయించడం రోగుల్ని పట్టపగలు నిలువు దోపిడీకి గురిచేయడమేనని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. చిల్లర వ్యాపారులకు కేవలం రూ.2,700 టోకు ధరకు సరఫరా చేస్తున్న ఔషధం గరిష్ఠ విక్రయ ధర (ఎంఆర్‌పీ)ను రూ.27 వేలుగా ముద్రించడం దిగ్భ్రాంతికరమని కోర్టు వ్యాఖ్యానించింది. ''ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనముద్ర దాల్చడం ఆశ్చర్యకరం'' అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. ఔషధాల ధరల నియంత్రణతో పాటు అందుకు సంబంధించిన ఇతర విషయాలపై దాఖలైన రెండు పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ అభిప్రాయాలు వ్యక్తం చేసింది. ''రిటైలర్ (చిల్లర) వ్యాపారికి రూ.2,700కు అందిస్తున్న క్యాన్సర్ ఔషధంపై రూ.27,000 ఎమ్మార్పీ ముద్రిస్తున్నారు. విక్రయ ధరను పదిరెట్లు ఎక్కువగా చూపడం దిగ్భ్రాంతికరం'' అని న్యాయస్థానం పేర్కొంది. ఇది రోగులను పట్టపగలు దోపిడీకి గురిచేయడమేనని అభిప్రాయపడింది. రోగులను ఈ విధమైన మోసానికి ఎందుకు గురిచేస్తున్నారు అని నిలదీసింది. రిజిస్టర్ అయిన వైద్యులు తమ రోగులకిచ్చే డాక్టర్ చీటీలో జనరిక్ ఔషధాలను సూచించాలని కూడా తాను కోరినట్టు పిటిషనర్లలో ఒకరు విన్నవించారు. ప్రభుత్వం దీన్ని ప్రతికూల వ్యాజ్యంగా భావించడం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్ న్యాయస్థానానికి తెలియజేశారు. ఔషధాల ధరల నిర్ధారణ అత్యంత ముఖ్య విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విషయంపై తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

# భార్య, మత గురువులను చంపి.. పిల్లల్ని బందీలుగా మార్చి..!



ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ఇద్దరు మత గురువులతో పాటు భార్యను హత్య చేసి, ముగ్గురు పిల్లలను బంధించాడు. అనంతరం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

అజంగఢ్‌కు చెందిన అరవింద్ సింగ్ మంగళవారం సాయంత్రం విధుల నుంచి ఇంటికి తిరిగివచ్చేసరికి ఆయన భార్య బబితా సింగ్ (32).. ఇద్దరు మతగురువుల సమక్షంలో మతపరమైన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇంట్లో ఏం చేస్తున్నారని ప్రశ్నించిన అరవింద్.. మత గురువులను తమ ఆధార్ కార్డులు చూపించాల్సిందిగా డిమాండ్ చేశాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన అరవింద్ తన లైసెన్స్‌డ్ గన్‌తో భార్యతోపాటు ఇద్దరు మత గురువులను కాల్చి చంపాడు. అనంతరం తన ముగ్గురు పిల్లలను తనతో పాటు ఓ గదిలో బంధించుకున్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందు ఇంట్లోకి వస్తే ముగ్గురు పిల్లలను కూడా చంపేస్తానని అరవింద్ బెదిరింపులకు పాల్పడ్డాడు. పిల్లలను రక్షించడానికి పోలీసులు ఏడు గంటలపాటు ప్రయత్నించారు. బుధవారం తెల్లవారుజామున గదిలోకి వెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించగా.. నిందితుడు వారిపైనా పలు రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో వారు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నిందితుడు ప్రాణాలు కోల్పోగా.. ఓ చిన్నారి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. మిగతా ఇద్దరు పిల్లలు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. అతీంద్రియ శక్తుల ప్రభావాలను నివారించేందుకు బబితా సింగ్ తమ ఇంట్లో కొన్ని రోజులుగా మతపరమైన ఆచారాలు నిర్వహిస్తోందని.. దానిని అరవింద్ వ్యతిరేకిస్తున్నాడని దర్యాప్తులో తేలిందన్నారు.

# భారత్, పాక్‌లకు ఒకే కంపెనీ డ్రోన్లు?

**- నెలల వ్యవధిలో ఒప్పందం కుదుర్చుకున్న ట్రంప్ కుటుంబ అనుబంధ సంస్థ**

భారత్‌కు డ్రోన్ల టెక్నాలజీ అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుటుంబ అనుబంధ అమెరికా సంస్థే పాకిస్థాన్‌కు డ్రోన్లు సరఫరా చేసేందుకు అంగీకరించింది. పాకిస్థాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి కొన్ని నెలల ముందే భారత్‌తో ఈ డీల్ కుదిరింది.

అమెరికాకు చెందిన పవరస్ కంపెనీ ట్రంప్ కుమారులకు సంబంధించిన సంస్థ. ఇది ఈ నెల 16వ తేదీన పాకిస్థాన్ సైన్యంతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంది. యాంటీ డ్రోన్లు సరఫరా చేసేందుకు అంగీకరించింది. పవరస్ సంస్థే జూన్ నెలలో భారత్‌లోని ముంబయి కేంద్రంగా పని చేసే పారస్ డిఫెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా గార్డియన్1 కౌంటర్ డ్రోన్ వ్యవస్థను తయారు చేసి విక్రయించాలని రెండు సంస్థలు నిర్ణయించుకున్నాయి. అయితే పారస్ కంపెనీ నేరుగా పవరస్‌తో కాకుండా దాని అనుబంధ కంపెనీ టాండెమ్ డిఫెన్స్ ఎల్ఎల్‌సీతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ ఒప్పందం ప్రకారం.. గార్డియన్1 యాంటీ డ్రోన్ వ్యవస్థలను పారస్ తయారు చేస్తుంది. స్థానిక మార్కెట్లో విక్రయిస్తుంది. ఇందుకుగానూ పవరస్‌కు పారస్ లైసెన్సు ఫీజును, నికర లాభాల్లో వాటాను అందజేస్తుంది.

**ఏమిటీ గార్డియన్-1**

**గార్డియన్-1 అనేది హైస్పీడ్, బ్యాటరీ ఆధారిత కౌంటర్ డ్రోన్ వ్యవస్థ. వైమానిక దాడుల ప్రమాదాలను అది గుర్తించి, ట్రాక్ చేసి అడ్డుకుంటుంది. దీనిని ఏక దిశ డ్రోన్ దాడులు, లాయిటరింగ్ మ్యునిషన్లు, డ్రోన్ స్వార్మ్‌లను అడ్డుకోవడానికి వినియోగిస్తారు. స్తవానికి గార్డియన్-1 ఇంటర్‌సెప్టర్‌ను ఇరాన్‌కు చెందిన షాహెద్, గెరాన్ డ్రోన్లను అడ్డుకోవడానికి అమెరికా రూపొందించింది. పవరస్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం ప్రకారం.. ఆ సంస్థ గార్డియన్-1 (మాన్యువల్), గార్డియన్-2 (సెమీ అటానమస్), గార్డియన్-3లను (ఫైర్ అండ్ ఫర్గెట్ వ్యవస్థ ఆధారిత) తయారు చేస్తుంది.**

**ఎవరిదీ కంపెనీ?**

**అమెరికా సైన్యంలో పని చేసి పదవీ విరమణ చేసిన ఆండ్రూ ఫాక్స్, బ్రెట్ వెలికోవిక్ 2025లో పవరస్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇది నాస్‌డాక్‌లో లిస్టయిన ఆరియస్ గ్రీన్‌వే హోల్డింగ్స్‌లో విలీనం కానుంది. ఆరియస్‌లో ట్రంప్ కుమారులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్‌లకు వాటాలున్నాయి. అమెరికన్ వెంచర్స్ పేరుతో ట్రంప్ కుమారులు ఆరియస్‌లో పెట్టుబడులు పెట్టారు.**



# పాతవని పారబోయొద్దు.. కొత్తగా ఇల్లు కట్టుకోవచ్చు..!

**సాధారణంగా పాత భవనాలను కూల్చినప్పుడు వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పారబోస్తుంటాం. కానీ వాటిలోని సిమెంట్, కంకర, ఇనుమును రీసైక్లింగ్ చేసి కొత్త భవనాన్ని నిర్మించి ఔరా అనిపించింది చెన్నైలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)లోని స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఈఆర్‌సీ). వ్యర్థాల నుంచి సంపద (కళివిల్ ఇరుందు సెల్వమ్) అనే ప్రాజెక్టులో భాగంగా 1953 చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో భవనం నిర్మించింది. ఇందులో 100శాతం రీసైక్లింగ్ ఇసుక, 50శాతం రీసైక్లింగ్ కంకర, స్లాగ్ సిమెంట్‌ను వినియోగించింది. బయటివైపు నిర్మాణానికి కాంక్రీట్, ఇటుకలు, లోపలి వైపు హాలోబ్లాక్‌లను వాడింది. రీసైక్లింగ్ చేసిన ఇనుముతో స్లాబ్ నిర్మించింది. తద్వారా సాధారణ ఖర్చులో 55శాతం తగ్గినట్లు అధికారులు తెలిపారు. 'కూల్చిన భవన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి కొత్త ఇంటిని నిర్మించే సాంకేతికతను రూపొందించాం. చెన్నై మహానగరపాలక సంస్థ సేకరించే వ్యర్థాల నుంచి భవన వ్యర్థాలను పొందుతాం. నూతన సాంకేతికత ద్వారా నిర్మాణ వ్యయం, పర్యావరణ కాలుష్యం తగ్గుతాయి. నూతన భవన దృఢత్వం బాగుందని ధ్రువీకరించాం' అని సీఎస్ఐఆర్ డైరెక్టర్ ఆనందవల్లి వివరించారు.**




# వేడుకల్లో విషాదం.. నదిలో మునిగి ఐదుగురి మృతి

**ఝార్ఖండ్‌లోని ఓ గ్రామంలో జరిగిన వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. పాలము జిల్లాలోని మారుమూల బొకాయ గ్రామంలో మంగళవారం ఆదివాసీలు సంప్రదాయ 'కరం' వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పూజించిన చెట్టుకొమ్మను బుధవారం తెల్లవారుజామున కోయల్ నదిలో నిమజ్జనం చేయడానికి వెళ్లారు. కొమ్మను నీటిలో వదిలేందుకు ఐదుగురు నదిలోకి దిగారు. నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో పట్టుతప్పి కొట్టుకుపోయారు ). వారిని రక్షించడానికి అక్కడ ఉన్నవారు ప్రయత్నించినప్పటికీ లాభం లేకపోయింది. అనంతరం జాలర్లు మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.**



# దేశ సంపద ఎవరి చేతుల్లో ఉంది?

భారతదేశంలో అసమానత గురించి మాట్లాడినప్పుడల్లా పేదరికం, నిరుద్యోగం, ఆదాయం వంటి అంశాలే ఎక్కువగా చర్చకు వస్తాయి. కానీ అంతకంటే ముఖ్యమైన ప్రశ్నలు వేరే ఉన్నాయి. దేశ సంపద ఎవరి చేతుల్లో ఉంది? పెద్ద వ్యాపారాలు, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మీడియా సంస్థలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? భారీ మైనింగ్, రోడ్లు, విద్యుత్, రక్షణ, సాగునీటి కాంట్రాక్టులు ఎవరికి దక్కుతున్నాయి? సుప్రీంకోర్టు, హైకోర్టులు, విశ్వవిద్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ అత్యున్నత అధికార పదవుల్లో ఎవరి ప్రాతినిధ్యం ఎంత?– ఈ అంశాలు పెద్దగా చర్చకు రావటం లేదు.

దేశంలోని అత్యంత ధనికులైన ఒక శాతం మంది దాదాపు 40శాతం సంపదను కలిగి ఉండగా, దిగువన ఉన్న 50శాతం ప్రజల చేతుల్లో కేవలం 3శాతం సంపద మాత్రమే ఉన్నది. కానీ ఈ ఆర్థిక అసమానతకు సామాజిక రూపం ఏమిటో సమగ్ర సమాచారం లేదు. సంపదలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు, ఇతర సామాజిక వర్గాల వాటా ఎంత? అవకాశాల్లో వారి శాతం ఎంత? అధికార వ్యవస్థల్లో ఎవరు ముందున్నారు? ఎవరు వెనుకబడ్డారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగేదే నిజమైన కులగణన. అందుకే కులగణనను కేవలం 'ఎవరు ఏ కులానికి చెందినవారు? వారి మొత్తం జనాభా ఎంత?' అనే ఫక్తు సంఖ్యగా చూడటం పొరపాటు. సమగ్ర సామాజిక, ఆర్థిక ప్రాతిపదిక దృష్టితో చేపట్టే కులగణనే భారత సమాజానికి ఒక ఎక్స్‌రేలా ఉపయోగపడుతుంది.

ఈ అంశాన్ని గత కొన్నేళ్లుగా రాహుల్‌గాంధీ జాతీయ రాజకీయ చర్చలోకి తెచ్చారు. కుల గణనను కేవలం జనాభా లెక్కల అంశంగా కాకుండా ప్రాతినిధ్యం, అవకాశాలు, అధికారంలో వాటా అనే ప్రశ్నగా ఆయన నిలబెట్టారు. దేశ జనాభాలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ఎంతమంది? ప్రభుత్వంలో, ఉన్నత విద్యలో, న్యాయవ్యవస్థలో, మీడియా, కార్పొరేట్ రంగాల్లో వారి వాటా ఎంత? అనే ప్రశ్నలను ఆయన పదేపదే సంధిస్తున్నారు. 'దేశానికి ఎక్స్‌రే అవసరం' అన్న రాహుల్‌గాంధీ వాదన వెనకున్న భావన సరిగ్గా ఇదే. రాహుల్‌గాంధీ నిరంతరంగా కులగణన అవసరాన్ని నొక్కివక్కాణించడంతోపాటు, బిహార్, తెలంగాణ రాష్ట్రాలు కుల ఆధారిత సర్వేలు నిర్వహించడంతో రాబోయే జనగణనలో కులగణన చేపడతానని మోదీ ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. అప్పటివరకూ కులగణనపై వ్యతిరేక వైఖరితో ఉన్న బీజేపీ తీసుకున్న 'యూటర్న్' ఇది. ఆనాడు బిహార్‌లోని ఓబీసీ–ఈబీసీ ఓటర్లను ఆకర్షించడం కూడా బీజేపీ నిర్ణయం వెనక రాజకీయ కారణాల్లో ఒకటి కావచ్చు.

తెలంగాణలో సర్వేకు ముందుగా వివిధ సామాజిక వర్గాలు, సంఘాలు, నిపుణులు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా సంప్రదింపులు జరిగాయి. ఏ ప్రశ్నలు అడగాలి? ఏయే సామాజిక–ఆర్థిక అంశాలను నమోదు చేయాలి? కుల గుర్తింపును ఎలా నమోదు చేయాలి? అనే విషయాలపై సూచనలు తీసుకున్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన గెజిట్లలో ఉన్న కులాల జాబితాలను ఆధారంగా తీసుకుని వాటిని పద్ధతిగా వర్గీకరించారు. ప్రతి కులానికి ఒక ప్రత్యేక కోడ్ కేటాయించారు. ఒకే కులానికి ప్రాంతాల వారీగా వాడే వేర్వేరు పేర్లు, ఉపకులాల పేర్లు, స్థానిక పేర్లు, సమానార్థక పేర్లను గుర్తించి అవన్నీ సంబంధిత కులానికి కేటాయించిన అదే కోడ్ కిందకు వచ్చేలా వ్యవస్థ రూపొందించారు. ఉదాహరణకు రజక, చాకలి, వన్నార్ వంటి వేర్వేరు పేర్లు ఒకే సామాజిక వర్గానికి సంబంధించినవిగా గుర్తించినప్పుడు అవి వేర్వేరు లెక్కలుగా విడిపోకుండా ఒకే ప్రామాణిక కోడ్ కింద నమోదయ్యేలా చేశారు. తెలంగాణలో సేకరించిన డేటాను కేవలం జనాభా లెక్కలుగా కాకుండా విద్య, ఉపాధి, జీవనోపాధి, ఆస్తులు, వ్యాపార యాజమాన్యం, సామాజిక స్థితి, ప్రాతినిధ్యం వంటి సూచికలతో విశ్లేషించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన నిపుణుల కమిటీ ఈ విశ్లేషణను చేపట్టి నివేదికను విడుదల చేసింది.

2026 ఆగస్టు 14న కేంద్రం విడుదల చేసిన సెన్సెస్ 2027 షెడ్యూలులోని కులం ప్రశ్న రూపకల్పనలోనే ప్రధాన సమస్య (లోపం) ఉంది. ఎస్సీ, ఎస్టీల విషయంలో అధికారికంగా గుర్తించిన జాబితాల ఆధారంగా క్రమబద్ధమైన వర్గీకరణకు అవకాశం ఉండగా, ఓబీసీలూ ఇతర కులాల విషయంలో మాత్రం వ్యక్తి చెప్పిన కులం పేరును ఓపెన్ టెక్స్‌ట్‌గా నమోదు చేసే విధానాన్ని ప్రతిపాదించారు. ఇది ఓబీసీలకు అన్యాయం చేసే కపట నాటకంగా కనిపిస్తున్నది. 2011 సామాజిక, ఆర్థిక కుల సర్వేలో 46 లక్షలకు పైగా వేర్వేరు కులాలు నమోదు కావడం ఇందుకు ఉదాహరణ. భారతదేశంలో 46 లక్షల కులాలు లేవు. ఒకే కులం వేర్వేరు పేర్లతో, ఉపకులాల పేర్లతో, ప్రాంతీయ పేర్లతో, సమానార్థక పేర్లతో నమోదు కావడంతో లెక్కలు విపరీతంగా చీలిపోయాయి.

ఈ సమస్య కేంద్ర ప్రభుత్వానికి తెలియదని అనుకోవడానికి లేదు. 2021లో సుప్రీంకోర్టుకు కేంద్రం స్వయంగా ఇదే సమస్యలను వివరించింది. గత అనుభవంలో ఏ లోపాలు వచ్చాయో ప్రభుత్వానికి తెలుసు. వాటికి పరిష్కారం ఏమిటో కూడా తెలుసు. సామాజిక వర్గం, కులం రెండింటినీ విడిగా నమోదు చేయాలి (బీసీ–యాదవ మాదిరి). రాష్ట్రాలవారీగా అధికారికంగా గుర్తించిన కుల జాబితాలను ఉపయోగించాలి. ఒకే కులానికి ఉన్న వేర్వేరు పేర్లు, ఉపకులాలు, ప్రాంతీయ పేర్లను ఒకే కోడ్ కింద నమోదు చేయాలి. జాబితాలో లేని పేర్లకే స్వేచ్ఛగా నమోదు చేసే అవకాశం (ఓపెన్ టెక్స్‌ట్‌గా) ఇవ్వాలి. ఓబీసీల కులాలను సరైన జాబితాలు, కోడ్‌లు లేకుండా నమోదు చేస్తే ఒకే కులం వేర్వేరు పేర్లతో చీలిపోవచ్చు. అప్పుడు ఆ కులం జనాభా, దాని సామాజిక స్థితి, విద్య, ఉద్యోగాల్లో దాని ప్రాతినిధ్యం స్పష్టంగా తేలవు. ఇది తర్వాత పెద్ద సమస్యగా మారుతుంది. రిజర్వేషన్లు, ప్రాతినిధ్యం, సంక్షేమ విధానాల విషయంలో కోర్టులు నమ్మదగిన గణాంకాలను కోరుతున్నాయి. కానీ ఈ కులగణన పద్ధతి ఆదిలోనే బలహీనంగా ఉంటే విశ్వసనీయమైన డేటా ఎలా వస్తుంది? అప్పుడు నష్టపోయేది ఓబీసీలే!

అందుకే కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడంతో ఓబీసీల పోరాటం ముగిసిపోలేదు. అసలైన రెండోదశ పోరాటం ఆవశ్యకత ఇప్పుడు ఎంతగానో ఉన్నది. కేవలం కులగణన జరగడం మాత్రమే కాదు. అది సరైన పద్ధతిలో సమగ్రంగా జరగాలి. ఎన్నికల సమయంలో ఓబీసీలను హిందూ ఐక్యత పేరుతో బీజేపీ తన రాజకీయ వ్యూహంలో భాగం చేస్తున్నది. కానీ అదే ఓబీసీలు విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, అధికారంలో ప్రాతినిధ్యం, వనరుల్లో వాటా గురించి ప్రశ్నిస్తే మాత్రం కపటత్వంతో కూడిన కొత్త షరతులను ముందుకు తెస్తున్నది. ఓబీసీ రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతోందా అన్నది పరిశీలించేందుకు రోహిణి కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ తన నివేదికను 2023లో సమర్పించినా అది ఇప్పటికీ బహిరంగ చర్చకు రాలేదు. ఓబీసీలలో అంతర్గత అసమానతలపై ప్రభుత్వం స్వయంగా అధ్యయనం చేయించి ఆ ఫలితాలను ప్రజల ముందుకు తీసుకురాకపోవడం అనేక ప్రశ్నలకు, అనుమానాలకు దారితీస్తోంది. ఇంతకాలం కులగణన కోసం పోరాడిన ఓబీసీలు కేవలం జనాభా శాతం గణనతో సంతృప్తిచెంది మౌనంగా ఉంటే భవిష్యత్‌లో సామాజిక న్యాయం పొందలేరు. వారి సంఖ్య సరిగ్గా లెక్కించడంతోపాటు వారి సామాజిక, ఆర్థిక స్థితి దేశం ముందుకు స్పష్టంగా రావాలి. అప్పుడే ఆ గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగాలు, ప్రాతినిధ్యం, అవకాశాల్లో తమ సముచిత వాటా, న్యాయం గురించి ఓబీసీలు నినదించగలుగుతారు. పోరాడి న్యాయం పొందగలుగుతారు.

# గ్రూచో మార్క్స్ ఆలోచనా విధానమే

**నా మేధో వ్యాసంగాలలో నేను చాలావరకు ఒంటరిగానే కృషి చేస్తాను. పూర్వ విద్యార్థుల సంఘాలకు దూరంగా ఉంటాను. వాట్సాప్ గ్రూపులలో చేరడం నాకు ఇష్టం లేదు. ప్రముఖ హాస్యనటుడు గ్రూచో మార్క్స్ ఆలోచనా విధానమే నాది కూడా. 'నన్ను సభ్యుడిగా చేర్చుకోవడానికి ఏ క్లబ్ అయితే సిద్ధంగా ఉంటుందో అలాంటి క్లబ్‌లో నేను ఎప్పటికీ చేరను' అని గ్రూచో అన్నాడు. ఢిల్లీలో ఉన్నప్పుడు (1980ల్లో) కొన్ని సంవత్సరాల పాటు పీపుల్స్ యూనియన్ ఫర్ డెమొక్రాటిక్ రైట్స్ (పీయూడీఆర్)కు సన్నిహితంగా మెలిగేవాణ్ణి. ప్రతి శనివారం త్రివేణి కళా సంఘంలో జరిగే పీయూడీఆర్ సమావేశాలకు హాజరవుతుండేవాణ్ణి. పరిశోధక విద్యార్థిగా నాకు లభించే ఉపకార వేతనం నుంచి ఒక స్వల్ప మొత్తాన్ని ఆ హక్కుల సంఘానికి ఇస్తుండేవాణ్ణి. ఒక సందర్భంలో పీయూడీఆర్ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ సంఘంలో సభ్యుడిగా కూడా ఉన్నాను.**



ఆ హక్కుల సంఘంలో నేను ఎన్నడూ కీలక కార్యకర్తగా లేను. సహ ప్రయాణికుడిని, సానుభూతిపరుడిని మాత్రమే. పౌరహక్కుల పరిరక్షణలోను, ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంపొందించడంలోనూ పీయూడీఆర్ కృషి పట్ల నాకు అపార గౌరవాభిమానాలు ఉన్నాయి. 1990ల్లో నేను ఢిల్లీ నుంచి బెంగళూరుకు మారాను. దీంతో ఆ హక్కుల సంఘంతో నా సన్నిహిత సంబంధం తెగిపోయింది. ఇటీవల ప్రచురితమైన అంకితా పాండే పుస్తకం చదివినప్పుడు పీయూడీఆర్‌తో నా సంబంధాలు జ్ఞాపకమొచ్చాయి. 'ally activism'కు ఉదాహరణగా పౌర హక్కుల సంఘాలను ఆమె పేర్కొన్నారు. 'ప్రత్యక్ష, వ్యక్తిగత లేదా భౌతిక ప్రయోజన సంబంధం లేనివారు ఒక అణగారిన వర్గానికి మద్దతుగా చేపట్టే సామూహిక చర్య'గా 'అల్లే యాక్టివిజం'ను ఆమె నిర్వచించారు. భారతదేశ పౌరహక్కుల ఉద్యమాల్లో రెండు విస్తృత ధోరణులు ఉన్నాయని అంకితా పాండే వివరించారు. ఒకటి- రాజ్యాంగంలో క్రోడీకరించిన పౌరుల హక్కుల రక్షణ కాగా, మరొకటి ప్రజల విస్తృత సామాజిక, ఆర్థిక హక్కుల సాధన.

1970ల్లో కలకత్తా కేంద్రంగా పనిచేసిన అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ (ఏపీడీఆర్) స్వతంత్ర భారతదేశంలో ప్రప్రథమ పౌర హక్కుల సంఘం. నక్సలైట్ ఉద్యమంతో సంబంధమున్న జైలు ఖైదీలపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ తొలి పౌరహక్కుల సంఘం విశేష కృషి చేసింది.

కాలక్రమానుసారంగా ఏపీడీఆర్ మొట్టమొదటి హక్కుల సంఘం అయినప్పటికీ విస్తృత కృషి చేసిన హక్కుల సంఘం మాత్రం పీయూడీఆర్ అని చెప్పవచ్చు. పలు దశాబ్దాల పాటు చేసిన కృషిలో దాదాపు 300 నివేదికలను ఈ సంఘం ప్రచురించింది. విచారణలో ఉన్న ఖైదీలపై పోలీసుల క్రౌర్యం, ఎన్‌కౌంటర్ మరణాలు, అసంఘటితరంగ కార్మికుల దుస్థితి, అడవులపై ఆదివాసీల హక్కులకు ఎసరు పెట్టిన చట్టాలు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, దళితులపై దురాగతాలు, మతపరమైన మైనారిటీలపై వివక్ష మొదలైన అంశాలపై ఏపీడీఆర్ నివేదికలు పథ నిర్దేశకమైనవి. ఆ నివేదికల్లో అనేకం ఇప్పుడు ఏపీడీఆర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసిన పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) మరో ప్రముఖ హక్కుల సంఘం. న్యాయకోవిదుడు జస్టిస్ వీఎం తార్కుండే సారథ్యంలో ఇది పలు రాష్ట్రాల్లో పనిచేసింది. ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ, హ్యూమన్ రైట్స్ ఫోరమ్ ఉభయ తెలుగు రాష్ట్రాలలో క్రియాశీలకంగా ఉన్నాయి. మహారాష్ట్రలో క్రియాశీలకంగా ఉన్న కమిటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రాటిక్ రైట్స్ వ్యవస్థాపకులలో అస్గర్ అలీ ఇంజినీర్ ఒకరు.

అంకితా పాండే పుస్తకంలోని ఒక అధ్యాయం భారతదేశంలోని పౌరహక్కుల సంఘాల ప్రధాన కార్యాచరణ రూపమైన 'నిజనిర్ధారణ నివేదికల (ఫ్యాక్ట్-ఫైండింగ్ రిపోర్ట్స్)'పై దృష్టి సారించింది. హింసను ప్రేరేపించడంలోనూ, తద్వారా పౌరుల భద్రత, రక్షణ, ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించడంలోనూ ప్రభుత్వాధికారుల నేరపూరిత బాధ్యతను నిరూపించడానికి ఈ నివేదికలు ప్రయత్నిస్తాయి. ఈ నివేదికలు మూడు ముఖ్యమైన విధులు నిర్వర్తించాయని అంకితా పాండే వివరించారు. మొదటిది- ప్రజల జ్ఞాపకాలను చట్టపరంగా ఉపయోగపడే ఆధారాలుగా మార్చాయి. నిజ నిర్ధారణ సంఘాలు ప్రజల వాంగ్మూలాలను క్రమబద్ధీకరించి, ధ్రువీకరించి ఒక నివేదిక రూపంలో భద్రపరిచాయి. తద్వారా వాటిని న్యాయస్థానాలు అంగీకరించేలా చేశాయి; రెండోది- సంఘటనల పూర్వాపరాల చరిత్రను సవివరంగా నమోదు చేయడం; మూడోది- పోలీసు రికార్డులు, పరిపాలనా పరమైన పత్రాలు, నివేదికలలోని లోపాలను గుర్తించడం, పరస్పర విరుద్ధ విషయాలను ఎత్తిచూపడం, తద్వారా వాస్తవాలను తారుమారు చేసిన రికార్డులను బయటపెట్టడం.

అధికారిక కథనాలను నిరాకరించి, వాటిలోని అసంగతాలు, పరస్పర వైరుధ్యాలను బహిర్గతం చేసి, తద్వారా ప్రజల, పత్రికల దృష్టిలో వాటి విశ్వసనీయతను ప్రభావదాయకంగా ప్రశ్నించడమే ఈ 'నిజ నిర్ధారణ' నివేదికల లక్ష్యం. ప్రభుత్వం పాల్పడిన తప్పుడు పనులపై అవి వెలుగులు ప్రసరించాయి. ప్రభుత్వాధికారుల పక్షపాతాలు, పాక్షికాభిప్రాయాలను అవి బాహాటపరిచాయి.

ఈ పౌరహక్కుల సంఘాల కార్యకర్తలు అందరూ స్వచ్ఛంద సేవకులే. రాజ్యాంగ స్ఫూర్తితో సముదాత్త ఆశయాల సాధనకు అంకితమై సమాజ శ్రేయస్సుకు నిస్వార్థంగా శ్రమిస్తున్న ఉదాత్త వ్యక్తులు. విదేశీ, కార్పొరేట్ నిధులు ఏ విధంగానూ తీసుకోరు. సమాజ దురభిప్రాయాలు, ప్రభుత్వాల వ్యతిరేకత నెదుర్కొంటూ అవిరామంగా, అవిశ్రాంతంగా పనిచేస్తున్న నిజమైన ప్రజా సేవకులు. బాహ్య ఒత్తిళ్లతో పాటు ఒక అంతర్గత సవాల్‌ను కూడా వారు ఎదుర్కొన్నారు: రాజ్యం పట్ల విమర్శనాత్మక వైఖరిని పాటిస్తూ అదే సమయంలో రాజకీయ పక్షాల ప్రభావం లేకుండా స్వతంత్రంగా వ్యవహరించడం. దీనితో పాటు జెండర్ న్యాయానికి సంబంధించిన ప్రశ్న కూడా వారిని వెంటాడింది. పీయూడీఆర్, ఏపీసీఎల్‌సీ ప్రముఖ కార్యకర్తల్లో పలువురు మహిళలు ఉన్నారు. పౌరులకు వ్యతిరేకంగా రాజ్య వ్యవస్థ పాల్పడుతున్న హింసాత్మక కార్యకలాపాలపైనే హక్కుల సంఘాలు తమ దృష్టిని కేంద్రీకరించాలని వారి పురుష సహచరుల వాదన.. మహిళా కార్యకర్తలు వారితో ఏకీభవించడం లేదు. కుటుంబ జీవిత పరిధిలో చోటు చేసుకుంటున్న హింస గురించి కూడా హక్కుల సంఘాలు పట్టించుకోవాలనేది మహిళా ఉద్యమకారుల వాదన. ప్రజాస్వామిక హక్కుల విస్తృత చట్రంలో ఒక ప్రధాన భాగంగా మహిళా హక్కులను అంతిమంగా హక్కుల సంఘాలు అంగీకరించాయి. పౌరహక్కుల ఉద్యమంలో పనిచేస్తున్న వారిలో విద్యావేత్తలు, పాత్రికేయులు, న్యాయవాదులు ప్రధానంగా ఉన్నారని అంకితా పాండే పేర్కొన్నారు. వేతన జీవులు అయిన ఈ మధ్యతరగతి విద్యావంతులు తమ మాతృదేశాన్ని మరింత న్యాయమైన, మానవీయ సమాజంగా రూపొందించేందుకు అంకితమైన ఆదర్శవాదులు. భారత రాజ్య వ్యవస్థ అభియోగాల మేరకు సుదీర్ఘకాలం జైలు నిర్బంధంలో ఉన్న న్యాయవాది, హక్కుల కార్యకర్త సుధా భరద్వాజ్ అభిప్రాయాన్ని పాండే తన పుస్తకంలో ఉటంకించారు: 'నేను జైలులో మూడు సంవత్సరాలు గడిపాను. నా జైలు జీవితం చాలా బాధాకరంగా ఉన్నదనడంలో సందేహమేమీ లేదు. అయితే నాకంటే దురదృష్టవంతులు చాలామంది ఉన్నారు. వారి దుస్థితికి రోదించాను. నా హృదయం ద్రవించింది. మీరు అటువంటి దుష్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు మీ గురించి మీరు బాధపడడం కష్టం. బాధల్లో ఉన్న ఇతరులకు మీరు సహాయం చేయాల్సి ఉంటుంది.'

కీర్తిశేషుడు సీవీ సుబ్బారావు (1౼53–94)దీ ఇటువంటి మానవీయ స్వభావమే. పీయూడీఆర్ కార్యకలాపాల్లో ఆయన చాలా సంవత్సరాల పాటు కీలకపాత్ర వహించారు. 1984లో సిక్కుల ఊచకోతపై పీయూడీఆర్ నివేదిక 'హు ఆర్ ది గిల్టీ'తో అంకిత పుస్తకం ప్రారంభమైనా సుబ్బారావు గురించి ఆమె ప్రస్తావించలేదు. ఆ నివేదిక ప్రధాన రచయిత సుబ్బారావే. అంకితా పాండే కథనంలో సుబ్బారావు ప్రస్తావన లేకపోవడాన్ని ఆమె తప్పుగా భావించలేము. ఎందుకంటే ఇతరుల కోసం తాను చేసిన పనిని ఆయన ఎప్పుడూ ఏ విధంగానూ చెప్పుకునే వారు కాదు. పీయూడీఆర్ కృషిలో తన ప్రమేయం గురించిన ప్రస్తావన రావడాన్ని ఆయన నిరాకరించే వారు. సుబ్బారావును ప్రత్యక్షంగా కలిసి, గమనిస్తేనే ఆయన ఎటువంటి ఉదాత్తుడో అర్థమవుతుంది. భారత ప్రజాస్వామ్యానికి ఆయన నిశ్చయంగా ఒక నిజమైన హీరో.

చిన్న చిన్న లోపాలు ఉన్నప్పటికీ అంకితా పాండే పుస్తకం విశిష్టమైనది. పౌరహక్కుల ఉద్యమాన్ని స్థూలంగా సమీక్షించిన విలువైన గ్రంథమది. అంకిత పుస్తకంతో పాటు దివంగత నీలాంజన్ దత్తా పుస్తకం 'సివిల్ లిబర్టీస్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా: ఫ్రమ్ కలోనియల్ టైమ్స్ టు ది ప్రెజెంట్'ను కూడా చదవాలి. మీడియా ఉదాసీనత, పోలీసు వ్యవస్థ క్రూరత్వం, న్యాయవ్యవస్థ అలక్ష్యం, మోదీ ప్రభుత్వ క్రియాశీల వ్యతిరేకతతో సహా పలు అపాయాలు ప్రజాస్వామిక ఆలోచనాశీలురు అయిన పౌరులకు వాటిల్లుతున్న ప్రస్తుత సందర్భంలో ఆ రెండు పుస్తకాలకు మరింత ప్రాసంగికత ఉన్నది. పెరుగుతున్న కేంద్రీకృత అధికారం, నిరంకుశ పాలనా ధోరణులు, వేగంగా ప్రబలమవుతున్న మెజారిటీవాదం దృష్ట్యా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పౌరహక్కుల కార్యకర్తల అవసరం మరెప్పటికంటే మరింత ఎక్కువగా ఉంది.

# బహుముఖ జ్ఞాననిధి

**తెలుగు సాహిత్యలోకం ఆత్మీయంగా 'తాతాజీ' అని పిలుచుకుంది. శృంగేరి పీఠాధిపతులు 'ఆంధ్ర విశారద' బిరుదుతో గౌరవించారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆ సాహితీమూర్తిని విశిష్ట సభ్యత్వ ప్రదానంతో సత్కరించింది. కవిగా, పండితుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, నాటకకర్తగా, అభ్యుదయ రచయితల ఉద్యమ ప్రారంభకుడిగా, హేతువాదిగా, పత్రికా సంపాదకుడిగా, సినీ రచయితగా... బహు పాత్రల్లో నిర్విరామ సాహితీ కృషి సాగించిన ఆయనే తాపీ ధర్మారావు. ఇప్పటి ఒడిశా రాష్ట్రం బరంపురంలో 1887 సెప్టెంబర్ 19న జన్మించారు. పర్లాకిమిడిలో గిడుగు రామ్మూర్తి శిష్యుడిగా ఎఫ్‌ఏ చదివి, మద్రాస్ పచ్చయ్యప్ప కాలేజీలో పట్టభద్రుడయ్యారు.**



ధర్మారావు మొదటి నుంచి స్వేచ్ఛాప్రియులు. తనకు నచ్చకపోతే ఎలాంటి ఉద్యోగాన్ని అయినా విడిచిపెట్టడానికి వెనకాడేవారు కాదు. అందుకే జీవితంలో ఆటుపోటులన్నింటినీ చవిచూసి పలురకాల వ్యాసంగాల్లో కొనసాగారు. ప్రారంభంలో కొన్నాళ్లు కళ్లికోట రాజావారి కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. 1910 ప్రాంతాల్లో కొందరు మిత్రులతో కలిసి 'వేగుచుక్క గ్రంథమాల' స్థాపించి 'తెలుంగనెడి కాంత', 'ఉషఃకాలము' తదితర గ్రంథాలు ప్రచురించారు. మద్రాసులో కాలేజీ ట్యూటర్‌గా, బొబ్బిలి సంస్థానం దివాన్‌గా, యుద్ధకాలంలో రిక్రూటింగ్ ఆఫీసర్‌గా రకరకాల ఉద్యోగాలు చేశారు.

ధర్మారావు మొదట గ్రాంథిక వాది. తన గురువు గిడుగుతో విభేదించారు. కాలక్రమంలో వ్యవహారిక భాషకు మారి స్వయంగా గురువే 'ధర్మారావు నాకు వారసుడు' అని ప్రకటించే స్థాయికి ఎదిగారు. 'పాతపాళీ' ఆయన రచనా పాటవానికి ప్రతీక అయితే, 'కొత్త పాళీ' వ్యవహారిక భాషకు ఎత్తిన పతాక. తాపీవారికి ఎనలేని కీర్తిని తెచ్చిన రచన చేమకూర వెంకట కవి విజయవిలాసానికి రాసిన 'హృదయోల్లాస' వ్యాఖ్య. విజయవిలాసంలో నిగూఢంగా ఉన్న అనేక చమత్కారాలను సవ్యంగానూ సమంజసంగాను ప్రకటించి అంతకుముందు పండితులు చెప్పని విషయాలు ప్రతిపాదించారు. అలా ఆ కావ్యంపై కొత్త వెలుగులను ప్రసరింపజేసి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు.

ప్రశ్నలంటే తనకు ఇష్టమని, సంగతేమిటో తెలుసుకోవాలన్న కుతూహలమని, ఆ అలవాటు మంచినీ తెచ్చింది, పాడు చేసింది కూడాను... అని రాసుకున్నారు తాపీ ధర్మారావు ఒక పుస్తకంలో. పెళ్లిదాని పుట్టుపూర్వోత్తరాలు, ఇనుప కచ్చడాలు.. లాంటి పరిశోధనాత్మక రచనలెన్నో చేశారు. కొన్ని గ్రంథాలపై విమర్శలు బలంగా వచ్చినా ఆయన తన అభిప్రాయాల్ని సమర్థించుకున్నారు. నంది తిమ్మన పారిజాతాపహరణ ప్రబంధానికి 'భావ ప్రకాశిక' పేరుతో వ్యాఖ్యానం రచించారు. సాహిత్య మొర్మొరాలు, రాలూ రప్పలూ, ఆల్ ఇండియా అడుక్కుతినేవాళ్ల మహాసభ... తదితర రచనలు తాతాజీ కలం నుంచి వెలువడ్డాయి. కొండెగాడు, సమదర్శిని, జనవాణి, కాగడా మొదలైన పత్రికలు ధర్మారావును విశిష్ట పత్రికా సంపాదకుడిగా నిలబెట్టాయి. 1936లో సినిమా రంగంలో ప్రవేశించి దాదాపు 50 చిత్రాలకు మాటలు రాశారు. నాటకాలూ వెలువరించారు. ఈ బహుముఖ జ్ఞాననిధి 1973 మే 8న కన్నుమూశారు. తెలుగు పత్రికల్లో వాడుకభాష వినియోగానికి పాదులుతీసిన ధర్మారావు పుట్టినరోజును 'తెలుగు మాధ్యమాల దినోత్సవం'గా జరుపుకోవడం విశేషం.

# ఏజెన్సీలో ఆదివాసీల పాలనే సాగాలి

**ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధులు నియామకాలు ఆంధ్రా వారు దోచుకున్నారు. తెలంగాణ వచ్చాక మైదాన ప్రాంతం వారు దోపిడీ చేస్తున్నారు. నేడు ఆదివాసీల రిజర్వేషన్లను కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారు. ఏజెన్సీలో చట్టవిరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా పీసా చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో జిల్లాల పునర్విభజన పేరుతో ఆదివాసీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలలో కలిపారు. 90శాతం ఆదివాసుల రిజర్వేషన్ ఉద్యోగాలను లంబాడీలు చట్టవ్యతిరేకంగా దోచుకుంటున్నారు. మరోవైపు చెల్లప్ప కమిషన్ ద్వారా మరో మూడు కులాలను ఎస్టీ జాబితాలో కలిపి ఆదివాసులను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ విధ్వంసంపై ప్రజాస్వామికవాదులు, ప్రజా సంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు నోరు మెదపటం లేదు.**



బ్రిటీషు వారి కాలం నుంచి ఆదివాసీలకు అడవిపై హక్కు ఉంది. కానీ నేటి పాలకులు ఈ హక్కులను కాలరాస్తున్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదు. ఉన్న భూములలో ట్రెంచ్ కొడుతున్నారు. బహుళజాతి కంపెనీలకు అడవినీ, అటవీ సంపదను, ఖనిజ వనరులను ధారాదత్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోకి గిరిజనేతరుల వలసలతో ఆదివాసీల చట్టాలు కనుమరుగు అవుతున్నాయి. పాల్వంచ కేటీపీఎస్‌లో నాలుగువేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. దీని నిర్మాణంలో ఆదివాసీలు భూములు, ఉపాధి కోల్పోయారు. భద్రాచలం బీపీఎల్ ఫ్యాక్టరీ నిర్మాణంలోనూ మణుగూరు బీటీపీఎస్ నిర్మాణంలోనూ, సింగరేణి సంస్థ కార్యకలాపాలలోనూ ఆదివాసీలు భూములు కోల్పోయారు. నిర్వాసితులకు ఉద్యోగాలు సైతం ఇవ్వడం లేదు.

గోదావరి జలాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆదివాసీలకు తాగునీరు, సాగునీరు అందడం లేదు. గోదావరి ఇసుకను హైదరాబాద్, బెంగళూర్ తరలిస్తున్నారు. ఆదివాసీలు ఇళ్ళు కట్టుకోవడానికి ఇసుక ఇవ్వడానికి అటవీ శాఖ, పోలీస్ శాఖ ఎన్నో ఆంక్షలు పెడుతున్నాయి. 1/70 చట్టం రద్దు చేయడానికి భద్రాద్రి కొత్తగూడెం నుంచి 1700 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని; ఐటీడీఏలో అటెండర్ నుంచి అధికారుల వరకు ఆదివాసీలనే నియమించాలని; ప్రభుత్వ ఉద్యోగాలన్నింటినీ ఐటీడీఏ ద్వారా భర్తీ చేయాలని; ఐటీడీఏ పరిధిలోని అన్ని ఏజెన్సీ మండలాల్లో ఆదివాసీలను తహసిల్దార్, ఎంపీడీవోలుగా నియమించాలని; ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని; 1/70 చట్టం, పీసా చట్టం ఏజెన్సీలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నారు. చట్టాల అమలు కోసం, ఆదివాసీల అస్తిత్వం కోసం తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21న భద్రాచలం ఐటీడీఏ ముట్టడి- ఆదివాసీ మార్చ్‌ను నిర్వహిస్తున్నారు.

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

గురువారం | అనంతపురం | 24.09.2026 | 01


## బందరులో గోవా షిప్ యార్డు కంపెనీ ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం

**- రూ.8 వేల కోట్ల పెట్టుబడితో 10 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు**

**- షిప్ యార్డుకు ఆమోదంపై సీఎం, డిప్యూటీ సీఎం, కేబినెట్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర**

**అమరావతి సెప్టెంబర్ 13, అనంత జనశక్తి న్యూస్**

మచిలీపట్నంలో గోవా షిప్ యార్డు కంపెనీ ఏర్పాటుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి, రాష్ట్ర కేబినెట్‌కు ధన్యవాదాలు తెలిపారు.గోవా వెలుపల మెగా డిఫెన్స్ ప్రాజెక్టు ఏర్పాటు కావడం హర్షణీయం. కేంద్ర కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ గోవా షిప్‌యార్డ్ కంపెనీ సుమారు రూ.8 వేల కోట్ల భారీ పెట్టుబడితో బందర్ పోర్టు కేంద్రంగా యుద్ధనౌకల తయారీ, మరమ్మతుల కేంద్రాన్ని ఏర్పాటు

చేసే ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 3,000 మందికి ప్రత్యక్షంగా, 5,000 మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మచిలీపట్నం పోర్ట్ పరిధిలో దాదాపు 400 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్ట్ కోసం కేటాయించబోతున్నాం.

ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్‌కు అవసరమైన అత్యాధునిక యుద్ధనౌకలను గోవా షిప్ యార్డు కంపెనీ తయారు చేస్తుంది. ఇంతటి భారీ ప్రాజెక్టు ఏర్పాటుకు అన్ని రకాల తోడ్పాటు అందించిన ముఖ్యమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సీఎం సానుకూలం

**- మంత్రి నారాయణ**

**- సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడుతా : నారాయణ**

**విజయవాడ, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**



అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు త్వరిత గతిన పరిష్కారం చూపే దిశలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు సానుకూలంగా ఉన్నారని పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేసారు. దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సీఆర్‌డీఏ కమిషనర్‌తో పాటు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో వెంటనే మాట్లాడి హౌసింగ్ స్కీమ్‌పై తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశకత్వంలో ఆయన ఆలోచనల మేరకు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతామని వివరించారు.బుధవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు నారాయణను కలిసారు...సొసైటీ సభ్యుల గృహ నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలను వివరించారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని మంత్రికి సమర్పించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 107, దాని అమలుకు సంబంధించిన విధివిధానాలు, హౌసింగ్ స్కీమ్‌పై తొలిగిపోయిన న్యాయపరమైన అపోహలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి జారీ అయిన అన్ని జిఓలను పురపాలక పట్టణాభివృద్ధి శాఖే విడుదల చేసిందని, ప్రస్తుతం అమలు బాధ్యత కూడా ఆ శాఖపైనే ఉందని పత్రికా ప్రతినిధులు నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు.సొసైటీ ప్రతినిధుల వివరాలను విన్న మంత్రి నారాయణ...ఈ అంశాన్ని సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి ముందుకు తీసుకెళ్లతామని స్పష్టం చేశారు. సీఆర్‌డీఏ కమిషనర్‌తో మాట్లాడటంతో పాటు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శితో కూడా చర్చిస్తానని తెలిపారు. పాత్రికేయిల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, తమది జర్నలిస్టు స్నేహపూర్వక ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో కీలకమని నారాయణ అన్నారు. రాజధాని నిర్మాణం వేగంగా ముందుకు సాగుతున్న సమయంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని, వారి సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ అంశంపై గతంలోనే మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్ సొసైటీ ప్రతినిధులతో జరిపిన చర్చల్లో సానుకూల వైఖరి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లే అవకాశాలను వారు వివరించారు.

ఇప్పటి వరకు జరిగిన పరిణామాలకు కొనసాగింపుగా మంత్రి నారాయణ తాజాగా ఇచ్చిన హామీతో సీఆర్‌డీఏ స్థాయిలో తదుపరి ప్రక్రియ కదలికలోకి వస్తుందనే ఆశాభావం సొసైటీ ప్రతినిధుల్లో వ్యక్తమవుతోంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ స్కీమ్‌కు ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం లభిస్తుందని వారు ఆశిస్తున్నారు.మంత్రి నారాయణను కలిసిన వారిలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి,ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ తిరువాయిపాటి శ్రీనాథ్, , హన్స్ ఇండియా రెసిడెంట్ ఎడిటర్ శ్యామ్ సుందర్,ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెంట్ ఎడిటర్ మల్లేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు కృష్ణారావు, రామకృష్ణ (ఢిల్లీ) పాల్గొన్నారు.

## బుక్కపట్నం మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**- సిద్ధాపురం రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**- సిద్ధాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్**

**- అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహార పంపిణీ వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్**

**బుక్కపట్నం,సెప్టెంబర్,23:అనంత జనశక్తి న్యూస్**

బుక్కపట్నం మండలం సిద్ధాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. గ్రామంలోని గ్రామ సచివాలయం, రైతు సేవ కేంద్రం, విలేజ్ క్లినిక్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.అనంతరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు.తనిఖీల్లో భాగం గా కలెక్టర్ పలు ప్రభుత్వ విభాగాలు, సేవల నిర్వహణపై ఆరా తీశారు.ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, పిటిషన్ల పరిష్కారం మరియు సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా సకాలంలో సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.రైతులకు అందిస్తున్న విత్తనాలు, ఎరువుల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి కొరత రాకుండా ఈపంట (eCrop) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.గ్రామంలో లభ్యమవుతున్న వైద్య సేవలు, ఉచిత మందుల నిల్వలను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సలహాలు అందించాలని, ల్యాబ్ పరీక్షల సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. నాడునేడు పనుల పురోగతి,విద్యా కానుక మరియు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.చిన్న పిల్లల హాజరు, వారి ఆరోగ్య పరిస్థితులు మరియు పౌష్టికాహార పంపిణీ వివరాలను తెలుసుకున్నారు.చిన్నపిల్లల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని సిబ్బందికి స్పష్టం చేశారు.ప్రభుత్వ పథకాలు మరియు సేవలు ప్రజలందరికీ పారదర్శకంగా, సమర్థవంతంగా అందాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

# ఓ వర్గం అభిప్రాయంతో మమా.....





**- జోరు వానతో సమావేశానికి హాజరుకాని ప్రజలు**

**- ఇసుక తవ్వకాలు వద్దంటూ ఏక నిర్ణయం**

**- తక్కువ మోతాదులో తవ్వకాలు జరపవచ్చు**

**యల్లనూరు, సెప్టెంబరు 23, అనంత జనశక్తి న్యూస్;**

మల్లగుండ్ల గ్రామ సమీపంలో ప్రభుత్వ ఇసుకరీచు ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 11 గంటలు పైగా అవుతున్న ఏకధాటిగా వర్షం పడుతుండడంతో అధికారులు సమావేశాన్ని నిర్వహించాల వద్ద అని సందిగ్ధంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా వైసిపి నేతలు సభ ప్రాంగణానికి వచ్చారు. దీంతో అధికారులు అక్కడికి వచ్చిన వైసీపీ నేతలతోనే అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించి మమ అనిపించారు. అయితే ప్రజల నుండి అభిప్రాయాన్ని సేకరించకుండా పార్టీల నుండి అభిప్రాయాలను ఎలా సేకరిస్తారంటూ టిడిపి నేతలు సైతం అధికారులకు వారి అభిప్రాయాలను అందజేశారు.

**ఇసుక తవ్వకాలు వద్దు.....వైసిపీ**

చిత్రావతి నదిలో ఇసుక తవ్వకాలు జరపకూడదంటూ వైసీపీ నేతలు మాజీ మంత్రి సాకే శైలజనాథ్, సాయి ప్రతాప్ రెడ్డి, బోగాతి ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ గంగాదేవి లు ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణంలో గట్టిగా వాదించారు. గతంలో సరైన వర్షాలు లేక చిత్రావతికి నీరు రాక భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర అవస్థలు పడ్డామని, పంటలు సైతం పండించుకోలేక అప్పులు ఊబిలోకి కూరుకుపోయామన్నారు. కావున చిత్రావతి నదిలో ఇసుక తవ్వకాలను ఏ కోశానా జరపకూడదంటూ అధికారులతో గట్టిగా వాదించారు. ఇక్కడ నిర్వహిస్తున్నది ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించించెందుకే అని పర్యావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వైసీపీ నేతలు మాత్రం అలా కాదు తమ అభిప్రాయాలను రిజిస్టర్ లో నమోదు చేయాలంటూ భీష్మంచారు. చేసేది ఏమీ లేక అధికారులు రిజిస్టర్ లో ఇసుకరీచ్ తవ్వకాలకు అనుమతులు వద్దంటూ తీర్మానం చేసి అక్కడ వచ్చిన వారంతా సంతకాలను చేశారు

**వెళ్లిపోయిన ఆర్డీఓ...**

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ వైసీపీ నేతల అభిప్రాయాలను సేకరించిన వెంటనే అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆయన వెళ్లడంతో మిగిలిన శాఖల అధికారులు కూడా వెళ్లేందుకు సమాయత్నం అవుతుండగా టిడిపి నేతలు అధికారులతో వాదనకు దిగారు. ప్రజల నుండి అభిప్రాయాలను సేకరిస్తామని తెలిపి పార్టీల నుండి అభిప్రాయాలను ఎలా సేకరిస్తారంటూ అధికారులతో వాదనకు దిగారు.

**వరదల నుండి కాపాడండి .... టీడీపీ**

ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతంలో ఎక్కువ లోతు కాకుండా తక్కువ లోతులో ఇసుక తవ్వకాలు జరుపుకుంటే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన తమకు ఎటువంటి ఇబ్బందులు ఉండదని టిడిపికి చెందిన నేతలతో పాటు పలువురు రైతులు అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

గత నాలుగు సంవత్సరాల క్రితం చిత్రావతి నదికి వరదలు వచ్చాయని తద్వారా చిత్రావతి నదిలో పూడిక ఎక్కువ చేరడంతో నీరు దిగు ప్రాంతానికి ప్రవహించలేక నేరుగా చిలమకూరు, 85 నిట్టూరు, తో పాటు మల్లగుండ్ల, చింతకాయమంద గ్రామాలలోకి వరద నీరు వచ్చాయని, కావున చిత్రావతి నదిలో రెండు మీటర్ల మేర ఇసుక తవ్వకాలు జరిగితే వరదలు వచ్చినప్పుడు భూగర్భ జలాలు పెరగడంతో పాటు గ్రామాలకు ముంపు ముప్పు తప్పుతుందన్నారు. అలాగే నీరు కూడా సజావుగా దిగువకు ప్రవహిస్తుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం




**- మాజీ ఎంపీ తలారి రంగయ్య**

**- మాదినేని ఉమామహేశ్వర నాయుడు.**

**కళ్యాణదుర్గం బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్**

నియోజకవర్గ పరిధిలోనిమండల పరిధిలో ఉన్న ఎంపీటీసీ సభ్యులందరూ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఎంపీటీసీలకు ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉమామహేశ్వర నాయుడు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో 99% హామీలను అమలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.ఎన్నికల సమయంలో "నేను శ్రీమంతుడిని, నాకు డబ్బు అవసరం లేదు" అని చెప్పిన సురేంద్రబాబు, ప్రస్తుతం ఇసుక, కంకర, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలియజేశారు.ఆయన వ్యాపారాలే పరమవధిగా చేసుకుంటూ కళ్యాణదుర్గం ప్రాంత రైతుల పాలిట శాపంగా మారారని పేర్కొన్నారు.కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.అనంతరం పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీలను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు....

## సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకుని

# పంటల సాగు పెంచాలి



**అనంతపురం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకుని మిగిలిన విస్తీర్ణంలోనూ పంటల సాగు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు.అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ శాఖల అధికారులతో బుధవారం ఆయన ప్రైమరీ సెక్టార్‌పై సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు.జిల్లాలో సాధారణం కంటే 36 శాతం తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ, సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. జిల్లాలో 3,43,394 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,78,407 హెక్టార్లలో సాగు పూర్తయిందని వివరించారు.కొర్రలు, జొన్నలు, ఉలవలు, అలసందలు, పెసలు తదితర ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు.పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈపంట డిజిటల్ క్రాప్ సర్వే ఇప్పటికే 98 శాతానికి పైగా పూర్తయిందని, నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 302 రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్దేశించిన పంటల సాగు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి విజయకృష్ణ, ఎల్‌డీఎం మారుతి శ్రీనివాసులు, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గణనాధుడిని సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని ఉమా

**కంచికచర్ల (సెప్టెంబర్ 23): ఎన్టీఆర్ జిల్లా,అనంత జనశక్తి న్యూస్**

కంచికచర్ల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా సెంట్రల్ బ్యాంక్ రోడ్ లో శ్రీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం నాడు సందర్శించారు.విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జరిగిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**కుందుర్పి, సెప్టెంబర్ 23: అనంత జనశక్తి న్యూస్**

కుందుర్పి మండలంలోని ఆపిలేపల్లి ఉన్నత పాఠశాలలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన గోవర్ధన్, ఆర్. సుబ్బారామప్పలను కుందుర్పి మండల ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి తిప్పేస్వామి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.సీనియర్ ఉపాధ్యాయ నాయకులు బి. వెంకటేశులు మాట్లాడుతూ పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు. పురస్కారాలు పొందిన అనంతరం వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు. ఆపిలేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సి. తిమ్మప్ప ఆధ్వర్యంలో పురస్కార గ్రహీతలను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.సన్మాన గ్రహీత ఆర్. సుబ్బారామప్ప మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. తన శిష్యులు నేడు ఉపాధ్యాయులుగా, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగులుగా స్థిరపడటం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత గోవర్ధన్ మాట్లాడుతూ కుందుర్పి మండలం వడ్డేపాళ్యంలో నాలుగేళ్లపాటు పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కుందుర్పి మండలంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, తన సేవలను గుర్తించి




సన్మానించిన ఉపాధ్యాయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ నాయకులు, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలోని యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు అక్టోబర్‌లో అనంతపురంలోని ప్రభుత్వ కళాశాల (ఏ), ఆర్ట్స్ కాలేజీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. జానపద నృత్యం, జానపద గీతం, పెయింటింగ్, వీధి నాటకం, కవితా రచన విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. జానపద నృత్యం, జానపద గీతం, వీధి నాటకంలో 10 మంది చొప్పున బృందాలుగా పాల్గొనాల్సి ఉంటుంది.జిల్లా స్థాయిలో విజేతలకు రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయి విజేతలకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9959517370, 9010786106, 9849913062 నంబర్లలో సంప్రదించాలని ANSET ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. రవిశంకర్‌రెడ్డి తెలిపారు.అలాగే ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా స్థాయి యువజనోత్సవాల నిర్వహణకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు తమ సంస్థ వివరాలతో పాటు సమ్మతి పత్రాన్ని సెప్టెంబర్ 30, 2026లోగా ANSET, అనంతపురం కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

## ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు



- వ్యాపారులతో త్రీటౌన్ పోలీసుల సమావేశం
- దసరా మామూళ్ల పేరిట వేధిస్తే కఠిన చర్యలు -- త్రీటౌన్ సీఐ కౌలుట్లయ్య
- వ్యాపారులు భయపడొద్దు... సమాచారమిస్తే చర్యలు తప్పవు

**అనంతపురం క్రైం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

విజయదశమి పండుగను పురస్కరించుకుని అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యాపారులు, దుకాణదారులతో సీఐ కౌలుట్లయ్య బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో కలిసి స్థానిక త్రీటౌన్ లో నిర్వహించిన ఈ సమావేశానికి స్థానిక హోటళ్లు, కిరాణా షాపులు, మెడికల్ షాపులు మరియు జనరల్ స్టోర్స్ యజమానులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ... దసరా పండుగ పేరుతో హిజ్రాలు (ట్రాన్స్‌జెండర్లు) ఎవరైనా షాపుల వద్దకు వచ్చి హల్‌చల్ చేస్తూ, బలవంతంగా ఎక్కువ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తే వెనువెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.వ్యాపారులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా చర్యల్లో భాగంగా ప్రతీ హోటల్ యజమాని తమ ప్రాంగణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవి ఎల్లప్పుడూ పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు వ్యాపారులంతా పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## ఐలపోగు రాజేశ్వరి కి నివాళులర్పించిన దేవినేని ఉమా



**నందిగామ, (సెప్టెంబర్ 23):అనంత జనశక్తి న్యూస్**

నందిగామ మండలం, అంబారుపేటలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఐలపోగు ప్రశాంత్ కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. బుధవారం నాడు స్థానిక నేతలతో కలిసి ప్రశాంత్ మాతృమూర్తి ఐలపోగు రాజేశ్వరి భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఉమా ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గోస్తని నదిపై బ్రిడ్జి నిర్మించండి మహాప్రభో!

- వర్షా కాలంలో బాహ్య ప్రపంచంతో తెగిపోతున్న సీతంపేట గ్రామం

**అనంతగిరి, సెప్టెంబర్23: అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్నా, గ్రామానికి చేరుకోవాలన్నా గోస్తని నది దాటాల్సి వస్తోందని తెలిపారు.ముఖ్యంగా వర్షాకాలంలో గోస్తని నదిలో నీటి ప్రవాహం పెరగడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని వాపోయారు. అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాల్సిన సమయంలో, నిత్యావసర సరుకుల కోసం కాశీపట్నం సంతకు వెళ్లే సందర్భంలో కూడా నదిని దాటాల్సి వస్తోందన్నారు.నదిపై శాశ్వత బ్రిడ్జి లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో తమ గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై పలుమార్లు ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి గోస్తని నదిపై వెంటనే బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టి తమ కష్టాలను తీర్చాలని సీతంపేట గ్రామ గిరిజనులు సిఎచ్.సూర్యనారాయణ,జి.బిరసయ్య,వి.జమ్మయ్య,పి. చిన్నయ్య తదితరులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## లోకేష్ బాబు పర్యటన కార్యకర్తల్లో స్ఫూర్తి నింపింది..

- ఎమ్మెల్యే పరిటాల సునీత
- రాప్తాడు పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
- లోకేష్ బాబు చూపిన ప్రేమను మా కుటుంబం ఎప్పటికీ మరిచిపోదన్న సునీత

**రాప్తాడు సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**



తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాప్తాడు పర్యటన కార్యకర్తల్లో స్ఫూర్తి నింపిందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం రోజున నిర్వహించిన యువనేత నారా లోకేష్ పర్యటన అశేష జనవాహిని మధ్య అత్యంత దిగ్విజయంగా, చారిత్రాత్మకంగా సాగిందన్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఆమె తన అభిప్రాయాలను రాప్తాడు మండల ముఖ్య నాయకులతో కలిసి మీడియాతో పంచుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో భారీ ర్యాలీ, విగ్రహావిష్కరణలు, కార్యకర్తల సమావేశానికి వేలాదిగా తరలివచ్చిన జన సందోహం, కూటమి ప్రభుత్వ ప్రజాదరణకు అద్దం పట్టిందన్నారు. లోకేష్ పర్యటనను ఒక పండుగలా మార్చి, దిగ్విజయం చేసిన రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మంత్రులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, టిడిపి నాయకులకు ప్రతి ఒక్క కార్యకర్తకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో నారా లోకేష్ పరిటాల కుటుంబంతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని ప్రస్తావించడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని సునీత అన్నారు. సభ వేదికపై లోకేష్ నన్ను 'అమ్మ' అని ఆత్మీయంగా పిలవడం, పరిటాల శ్రీరామ్‌ను తన 'తమ్ముడు' అంటూ సంబోధించడం మా కుటుంబానికి ఆయన ఇస్తున్న గౌరవానికి, ఆత్మీయతకు నిదర్శనమన్నారు. ఆయన చూపిన ఈ ప్రేమ పరిటాల కుటుంబానికి మరియు నియోజకవర్గ కార్యకర్తలకు కొండంత బలాన్ని ఇచ్చిందన్నారు. కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ ప్రసంగం, ఇచ్చిన దిశానిర్దేశం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని, నూతన స్ఫూర్తిని నింపాయన్నారు. లోకేష్ ఇచ్చిన భరోసాతో కార్యకర్తలందరూ మరింత ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకెళ్తారని, రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడానికి పరిటాల కుటుంబం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

## బధిరుల సంక్షేమానికి అన్నివిధాల అండగా రాష్ట్ర ప్రభుత్వం



- జిల్లా రెవెన్యూ అధికారి

**అనంతపురం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**

బధిరుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి తెలిపారు . బుధవారం ఉదయం జిల్లా పరిషత్ మీటింగ్ హాలు నందు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, & వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరుల మరియు సైన్ లాంగ్వేజ్ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంస్థ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీమతి గిరిజమ్మ, సెక్రటరీ, DLSA, అనంతపురం, సర్వ శిక్ష అభియాన్ IED కో ఆర్డినేటర్, ఆర్డిటి సహాయ ప్రతినిధి యుగంధర్, పలువురు బదిరుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిధులు తొలుత అంతర్జాతీయ బధిరుల మరియు సైన్ లాంగ్వేజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ నారాయణ స్వామి గారు మాట్లాడుతూ వినికిడి లోపం అనేది ఒక బలహీనత కాదని అది ఒక ప్రత్యేకమైన జీవనశైలి అని గుర్తుంచుకోవాల్సిన అవసరంఉందన్నారు. సమాజంలో వినికిడి లోపం ఉన్నవారు ఒక అంతర్భాగమని వారందరూ కూడా మనలాగే కలలు ఆశయాలు సామర్థ్యాలు కలిగి ఉంటారని ముఖ్యంగా సైగల భాష ద్వారా వారు తమ భావాలను ఆలోచనలను వ్యక్తపరచగలరని తెలిపారు. బధిరులను ఆత్మీయంగా పలకరించే క్రమంలో సైగల భాషను నేర్చుకోవడం ద్వారా వారితో మరింత సులువుగా ఉండ వచ్చునని, అలాగే వారి ఆలోచనలు భావాలను కూడా గుర్తించేందుకు వీలుంటుంది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో వినికిడి లోపం ఉన్న వారిని అన్ని విధాల ఆదుకునేందుకు వారిని అనేక విధాల కార్యక్రమాల ద్వారా అవకాశాలు కల్పించడం జరుగుతున్నట్లు తెలిపారు. విద్య ఉద్యోగం ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు, అలాగే జిల్లా న్యాయ సేవ సదన్ లో సైన్ భాష ఇంటర్ప్రెటర్ ను కూడా నియమించే దిశగా ప్రయత్నం చేస్తామని సెక్రటరీ DLSA శ్రీ రాజ శేఖర్ గారు తెలిపారు. ఇందులో భాగంగా వైద్య శిబిరాల ఏర్పాటు పాఠశాలల్లో సైగల భాష ఉపాధ్యాయులను నియమించడం, అర్హులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం, పని ప్రదేశాలలో సైగ భాషలో సంభాషించే విధంగా అవకాశం కల్పించడం వంటివి జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పేర్కొన్నారు. బధిరుల సంక్షేమం కొరకు అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు 45 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని అలాగే అర్హులైన 6,707 మంది బధిరులకు పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతున్నట్లు తెలిపారు.బధిరులు కూడా మనోధైర్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాలలోనూ విజయం సాధించాలని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జి. అర్చన పేర్కొన్నారు.బధిరులలో కూడా అనేక ప్రతిభ పాటవాలు నైపుణ్యాలు ఉంటాయని వాటిని గుర్తించి సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా అర్హులకు శ్రవణ యంత్రములు లాప్టాప్ లు టచ్ ఫోన్లు తదితర వాటిని పంపిణీ చేయడం జరుగుతుందని అలిమ్కో ద్వారా జిల్లాలో 948 మంది బదిరులను శ్రవణ యంత్రంల కొరకు గుర్తించడం జరిగిందని త్వరలోనే వీరికి శ్రవణ యంత్రంలో పంపిణీ చేస్తారని జి. అర్చన తెలిపారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, సహాయ సంస్థ మరియు వసతి గృహా నిర్వాహకులు పాల్గొన్నారు.

## శభాష్ సాయి...



- బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్నబీసీ విద్యార్థి సాయికుమార్
- మంత్రి సవిత అభినందనలు

**అమరావతి సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

ఈ నెల 913 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల విద్యార్థి, బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సాయికుమార్, కోచ్ జూనా నాయక్, ప్రిన్సిపాల్ వై.రమేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 913 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్‌ఘడ్ లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరపున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అందజేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో సాయికుమార్ కు మెళకువులు నేర్పిన కోచ్ జూనా నాయక్ ను, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ ను కూడా మంత్రి సవిత అభినందించారు.

## రాజమహేంద్రవరంలో అంగరంగ వైభవంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు



- సెప్టెంబర్ 27న ఘనంగా నిర్వహణ..
- మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి, సెప్టెంబర్ 23: అనంత జనశక్తి న్యూస్**

సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పర్యాటక, సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.వెలగపూడి సచివాలయంలో బుధవారం పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. రాజమహేంద్రవరంలో నిర్వహించే పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

**గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు**

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి సూచించారు. టెంట్ నగరాలు, గృహ వసతి తదితర ఏర్పాట్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**శే, విదేశాల్లో పర్యాటక ప్రచారం**

ఆంధ్రప్రదేశ్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కొత్త పర్యాటక ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల విశిష్టతను తెలియజేసేలా దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ ప్రచార కార్యక్రమాలు, రోడ్‌షోలు నిర్వహించాలని ఆదేశించారు.ఏడాది పొడవునా పర్యాటక సందడి ఉండేలా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. మరిన్ని పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి సమర్పించి అదనపు నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు

.పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.సమావేశంలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, పర్యాటక సంస్థ ఎండీ పట్టాన్‌శెట్టి రవి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల విధులు చేశాం..

- బకాయిల కోసం ఎదురుచూపులు
- అల్లూరి జిల్లాలో సచివాలయ ఉద్యోగులకు అందని రూ.10,200

**అనంతగిరి, సెప్టెంబర్ 23: అనంత జనశక్తి న్యూస్**

జనాభా లెక్కల కార్యక్రమంలో భాగంగా గత మే నెల నుంచి విధులు నిర్వహించిన అల్లూరి జిల్లా సచివాలయ ఉద్యోగులకు ఇప్పటివరకు పారితోషికం అందలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా మారుమూల, కొండ ప్రాంత గ్రామాల్లో తిరుగుతూ జనాభా వివరాల సేకరణతో పాటు డీసీహెచ్‌బీ సర్వేలోనూ పాల్గొన్నామని తెలిపారు.

**ఒక్కొక్కరికి రూ.10,200 బకాయి**

జనాభా లెక్కల విధులకు ఒక్కో ఉద్యోగికి రూ.9,000, డీసీహెచ్‌బీ సర్వేకు రూ.1,200 చొప్పున మొత్తం రూ.10,200 రావాల్సి ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. విధులు పూర్తయి చాలా కాలం గడిచినా ఇప్పటివరకు తమ ఖాతాల్లో నగదు జమ కాలేదని తెలిపారు. అల్లూరి జిల్లా భౌగోళికంగా విస్తరించి ఉండటంతో పాటు అనేక మారుమూల, కొండ ప్రాంత గ్రామాలు ఉన్నాయని, సరైన రహదారి సౌకర్యాలు లేని ప్రాంతాలకు సైతం వెళ్లి ప్రతి ఇంటి వివరాలను సేకరించి అప్పగించిన బాధ్యతలను పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాను జనాభా లెక్కల కార్యక్రమంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేశామని తెలిపారు.

**వెంటనే బకాయిలు చెల్లించాలి**

రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో చెల్లింపులు జరిగినట్లు తమకు సమాచారం ఉందని, అల్లూరి జిల్లాలో మాత్రం ఇంకా చెల్లింపులు జరగలేదని ఉద్యోగులు పేర్కొన్నారు. దీంతో తమలో అసంతృప్తి నెలకొందన్నారు. జనాభా లెక్కల వంటి కీలక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసిన ఉద్యోగులకు రావాల్సిన పారితోషికాన్ని వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. తమకు రావాల్సిన మొత్తం, చెల్లింపుల తేదీపై అధికారులు స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయాన్ని సంబంధిత శాఖ దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కరికి రావాల్సిన రూ.10,200 బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మంత్రి సత్యకుమార్ యాదవ్ విస్తృత పర్యటన

**- ప్రజారోగ్యం.. సంక్షేమం.. అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి...**
**- 72 నూతన 104 ఎంఎంయూ వాహనాలకు శ్రీకారం.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.....**
**- చెరువు సుందరీకరణపై సమీక్ష.. కళాజ్యోతి శతవర్షోత్సవ వేడుకలకు హాజరు....**



**ధర్మవరం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, సత్యకుమార్ యాదవ్ ఈ నెల 25, 26 తేదీల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రెండు రోజుల పర్యటనలో ప్రజారోగ్యం, సంక్షేమం, మౌలిక వసతులు, పర్యావరణ అభివృద్ధి, సామాజిక కార్యక్రమాలకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నారు.

**72 నూతన 104 వాహనాలకు శ్రీకారం.....**

ఈ నెల 25న ఉదయం 10 గంటలకు ధర్మవరం పట్టణంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కిల్ వద్ద 72 నూతన 104 మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ వాహనాలు కీలకంగా పనిచేయనున్నాయి.

అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కళాజ్యోతి సర్కిల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. విద్యార్థుల్లో నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించనున్నారు.

సాయంత్రం 5 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నారు.

**సద్భావన భవనానికి శంకుస్థాపన....**

ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఎల్.సి.కె పురం వద్ద నూతనంగా నిర్మించనున్న సద్భావన భవనానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. సామాజిక ఐక్యత, సద్భావన, ప్రజల పరస్పర సహకారానికి దోహదపడే మౌలిక వసతుల అభివృద్ధికి ఈ కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టనున్నారు.

ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పాత్రికేయుల కోసం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని మంత్రి పరిశీలించనున్నారు.

**ధర్మవరం చెరువు సుందరీకరణపై సమీక్ష....**

మధ్యాహ్నం 1 గంటకు ధర్మవరం చెరువు సుందరీకరణకు సంబంధించి ఎస్‌పీఏతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొంటారు. చెరువు సుందరీకరణ ప్రతిపాదనలు, ప్రణాళికలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, సంబంధిత ప్రతినిధులతో చర్చించనున్నారు.

సాయంత్రం 5 గంటలకు కళాజ్యోతి సర్కిల్‌లో నిర్వహించే కళాజ్యోతి శతవర్షోత్సవ వేడుకలకు మంత్రి హాజరుకానున్నారు. నిర్వాహకులు, విద్యార్థులు, స్థానికులతో మంత్రి మమేకం కానున్నారు.

**ఆరోగ్యం నుంచి మౌలిక వసతుల వరకు..**

రెండు రోజుల పర్యటనలో భాగంగా ధర్మవరం నియోజకవర్గంలో ప్రజారోగ్య సేవల విస్తరణ, సంక్షేమ ఫలాల పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధి, చెరువు సుందరీకరణ, సామాజిక కార్యక్రమాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా దృష్టిసారించనున్నారు.

## మృతి చెందిన విద్యార్థిని కుటుంబమునకు ఉపాధ్యాయులు చేయూత

**- హెడ్మాస్టర్ జానకి.**

**ధర్మవరం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్:**

ఇటీవల పట్టణంలోని కదిరిగేటి వద్ద వినాయక నిమజ్జన సమయంలో ట్రాక్టర్ ప్రమాదంలో మునిసిపల్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల శాంతినగర్ లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని రాగే వర్షిత మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా మరుసటి రోజు పాఠశాలకు ఎంఈఓ ఆదేశాల మేరకు సెలవు ప్రకటించారు. తదుపరి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అందరూ కలిసి తమ వంతుగా ఆ కుటుంబానికి పదివేల రూపాయలను హెడ్మాస్టర్ తో పాటు ఉపాధ్యాయ బృందం కుటుంబానికి వెళ్లి నగదును అందజేశారు. హెడ్మాస్టర్ జానకి మాట్లాడుతూ.... పోయిన ప్రాణాన్ని తాము తేలేమని, విద్యార్థిని ప్రేమకు గుర్తుగా ఈ నగదును అందజేస్తున్నామని తెలిపారు. ఆ భగవంతుడు కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని, మృతి చెందిన రాగి వర్షిత ఆత్మకు శాంతి చేకూరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, అనిత, అరుణ, ప్రవల్లిక, సాయి గణేష్, ఆదిశేషు, పాల్గొన్నారు.



# రీ సర్వే పనులు పరిశీలన



**- నసనకోట, పోలేపల్లి గ్రామాల్లో రీసర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ రామ భూపాల్ రెడ్డి.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి**

**, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్:**

రామగిరి మండలంలోని నసనకోట, పోలేపల్లి గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, రీసర్వేలో భాగంగా చేపడుతున్న సరిహద్దుల నిర్ధారణ, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, భూ వివరాల నమోదు తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

రీసర్వే పనులను నిర్ణీత మార్గదర్శకాలు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు, భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.రీసర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని ఆర్డీఓ కోరారు. రీసర్వే ద్వారా భూ రికార్డులు మరింత ఖచ్చితంగా రూపొందించడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు మరియు ఇతర రీసర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్..

**గాండ్లపెంట,సెప్టెంబర్, 23, అనంత జనశక్తి న్యూస్,**

మండలంలోపాఠశాల విద్యార్థులు సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు వృత్తి విద్యా కోర్సులు అయిన రిటైల్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ కోర్సులకు సంబందించిన ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా అనంతపురం కియా షోరూం అనంత పీవీసీ పైప్స్ ఫ్యాక్టరీ డి మార్ట్ సైన్స్ మ్యూజియం ను సందర్శించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్ వృత్తి విద్య రజిత(రిటైల్ ) కుమారి( ఎలక్ట్రానిక్స్ ), ఎం. వెంకటేశ్వర్లు నాయక్ (ఆటోమోటివ్ ) పేటీఎం మురా ధ్వావలి, రాజారత్నం రాణి ఆధ్వర్యంలో ఈ సందర్శన జరిగినది, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఇండస్ట్రియల్ విజిట్ పిల్లలకు ప్రత్యక్ష అనుభవం కలిగించిందని ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో స్వయంగా చూసి నేర్చుకోవడంలో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనపరిచారని, ఈ వృత్తి విద్యాకోర్సులు విద్యార్థులకు భవిస్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయని తెలియజేయడం జరిగింది..




## చిన్నారి మృతి ఘటనపై ఆర్‌జేడీ విచారణ



**నల్లచెరువు సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్**

**శ్రీ సత్యసాయి జిల్లా, నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలోని తనకల్లు మండలం ముత్యాలవాండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గతేడాది జూన్ 3న నిశాంత్ అనే చిన్నారి నీటి తొట్టిలో పడి అనుమానాస్పదంగా మృతి చెందాడని అధికారుల విచారణతో ఈ మృతి ఘటనపై ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ మనోరంజని పీడీ ప్రమీళ స్థానిక మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సంయుక్తంగా విచారణ చేపట్టారు చిన్నారి తల్లిదండ్రుల సమక్షంలో ఈ విచారణ జరిగింది ఘటన జరిగినప్పుడు ఉన్న పరిస్థితులు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పరిణామాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవడంతో పాటు, పలు రికార్డులను అధికారులు పరిశీలించారు.అప్పటి ఘటనపై విచారణకు కారణం ఆ సమయంలో ప్రాజెక్ట్ సీడీపీఓగా పనిచేసిన జయంతి, చిన్నారి నిశాంత్ మృతిపై ఉన్నతాధికారులకు సరైన సమాచారం ఇవ్వలేదనే అభియోగం ఉండటంతో ఈ విచారణ చేపట్టినట్లు ఆర్‌జేడీ మనోరంజని తెలిపారు చిన్నారి మృతికి కారణమైన అంగన్‌వాడీ సిబ్బందిని విధులనుంచి తొలగించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఆర్‌జేడీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నల్లచెరువు సిడిపిఒ నిహారిక తదితరులు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.**

## ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

**- రాప్తాడు మండలంలో వ్యవసాయ, అనుబంధ శాఖల సమన్వయ సమావేశం**

**రాప్తాడు, సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్**




రాప్తాడు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, ఏపీసీఎన్ఎఫ్ విభాగాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయ అధికారి ఎస్. కృష్ణ చైతన్య, ఉద్యాన అధికారి దివ్య, పశుసంవర్ధక శాఖ అధికారి డా. సోమేశ్వరి, ఉపాధి హామీ పథకం ఈసీ మురళి, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జీలు ఎఫ్‌ఎంటీలు ప్రభాకర్, దేవి హాజరయ్యారు.

మండలంలోని వీఏఏ, వీఏహెచ్ఏ, ఎంపీఈఓలు, పశుసంవర్ధక సహాయకులు, ఏఈఓ రంజితతో పాటు అన్ని గ్రామాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**వర్షాలతో ఖాళీ భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు**

మండల వ్యవసాయ అధికారి ఎస్. కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన వర్షాల నేపథ్యంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూముల్లో ఉలవ, కొర్ర, జొన్న తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఉలవ విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రాల్లో 80 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పీఎండీఎస్‌పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.

**మిశ్రమ పంటలతో నేల ఆరోగ్యానికి ప్రయోజనం**

ఉద్యాన అధికారి దివ్య మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో మిశ్రమ పంటల సాగు చేపట్టడం ద్వారా నేల ఆరోగ్యం, సారవంతం పెరుగుతుందని వివరించారు. రైతులకు మిశ్రమ పంటల సాగు విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

**పశుగ్రాస లభ్యతపై సిబ్బందికి దిశానిర్దేశం**

పశుసంవర్ధక శాఖ అధికారి డా. సోమేశ్వరి మండలంలోని ప్రస్తుత పశువుల జనాభా, పశుగ్రాస లభ్యత తదితర అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పశుగ్రాస పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

**ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన**

ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జీలు ఎఫ్‌ఎంటీలు దేవి, ప్రభాకర్‌లు పీఎండీఎస్‌తో పాటు విత్తన గుళికల తయారీ విధానంపై వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

**హాఫ్ మూన్ మోడల్‌పై రైతుల ఎంపిక విధానం**

ఉపాధి హామీ పథకం ఈసీ మురళి మాట్లాడుతూ హాఫ్ మూన్ మోడల్ కింద క్షేత్రస్థాయిలో రైతుల ఎంపిక విధానం, అమలు చేయాల్సిన విధివిధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

## బీసీ భవన్‌కు భూమిపూజ



**- ఈ నెల 26న మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా భూమిపూజ..**
**- ఏర్పాట్లను పరిశీలించిన హరీష్ బాబు....**

**ధర్మవరం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని ఎల్‌సీకే పురంలో నిర్మించనున్న బీసీ భవన్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో ఈ నెల 26వ తేదీన రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, మునిసిపల్ ఈఈ సాయి కృష్ణతో కలిసి బీసీ భవన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. భూమిపూజ కార్యక్రమానికి సంబంధించి స్థల పరిశుభ్రత, వేదిక ఏర్పాటు, శిలాఫలకం, పార్కింగ్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**బీసీల సంక్షేమం.. ఆత్మగౌరవానికి ప్రతీకగా బీసీ భవన్...**

ధర్మవరంలో బీసీ భవన్ నిర్మాణం బీసీల సంక్షేమం, ఆత్మగౌరవం, సామాజిక అభివృద్ధికి మరో ముందడుగుగా నిలవనుంది. బీసీ వర్గాలకు సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ భవన్ ఉపయోగపడనుంది.

## ఉపాధ్యాయుల జోలికొస్తే మా కార్యకర్తల తరిమి తరిమి కొడతారు



**- వైసిపికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరిక**
**- ఉపాధ్యాయులపై వైసిపి గుండాల భౌతిక దాడి అత్యంత దుర్మార్గం**
**- అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా హింస, దాడులే వైసిపి నైజమన్న దగ్గుపాటి**
**- దాడి చేసిన వైసీపీ గూండాలు తగిన మూల్యం చెల్లించుకుంటారన్న దగ్గుపాటి**

**అనంతపురం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

వైసీపీ గుండాలు ఉపాధ్యాయుల జోలికి వస్తే తెలుగుదేశం కార్యకర్తలే మిమ్మల్ని తరిమి తరిమి కొడతారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై వైసీపీ గుండాలు భౌతిక దాడికి దిగడం అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా హింస, దౌర్జన్యాలు, దాడులే వైసీపీ నైజమని శాంతియుతంగా ఉండే ఉపాధ్యాయులపై దాడులు చేయడం ద్వారా వైసీపీ విద్రోహ, ఫ్యాక్షన్ సంస్కృతిని, తాము ఒక గొడ్డలి పార్టీ అనే విషయాన్ని ఆ పార్టీ నాయకులు మళ్లీ నిరూపించుకున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మెగా డీఎస్సీ నియామకాలను చేపట్టిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. నిరుద్యోగ యువత కలలను నిజం చేస్తూ, అత్యంత వేగంగా, పారదర్శకంగా, ఎక్కడా అవినీతికి తావులేకుండా ఈ డీఎస్సీ ప్రక్రియను నిర్వహించడం జరిగిందని కొనియాడారు. డీఎస్సీ ద్వారా కష్టపడి ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉదయం లేచింది మొదలు నిరుద్యోగుల భవిష్యత్తు కోసం మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, చూసి ఓర్వలేక వైసీపీ నేతలు రచ్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హతలు, సర్టిఫికెట్ల ప్రక్రియపై ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో అధికారులకు ఫిర్యాదు చేయాలి కానీ, రోడ్లపై పడి దాడులు చేస్తూ ఉపాధ్యాయుల జీవితాలతో ఆటలాడుతారా అని నిలదీశారు. గత వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలో ఉపాధ్యాయులను నడిరోడ్డుపై నిలబెట్టి హింసించిన చరిత్ర ఆ పార్టీదని ఎమ్మెల్యే దగ్గుపాటి దుయ్యబట్టారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై దాడులు చేయించే స్థాయికి దిగజారడం సిగ్గుచేటన్నారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన కేవలం ఉపాధ్యాయులపై జరిగిన దాడి కాదని, ఇది కూటమి ప్రభుత్వ శాంతిభద్రతలను క్షీణింపజేసేందుకు వైసీపీ చేసిన పెద్ద కుట్ర అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో అశాంతిని, రౌడీయిజాన్ని ప్రభుత్వం ఎంతమాత్రం సహించదని.. దాడికి పాల్పడిన వైసీపీ గుండాలను వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు.

## సేవా తత్పరతతను చాటుకున్న మున్నా నగర్ రమేష్..

**- పలువురికి ఆర్థిక సహాయం..**

**అనంతపురం, సెప్టెంబర్ 23 : అనంత జనశక్తి న్యూస్**

సేవా కార్యక్రమాల్లో భాగంగా టీడీపీ నాయకుడు, రాయలసీమ బలిజ యువజన జిల్లా అధ్యక్షుడు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఆర్టీసీ గౌరవ అధ్యక్షుడు మున్నానగర్ రమేష్ తన సేవా తత్పరతతను చాటుకుంటూ పలువురికి ఆర్థిక సహాయం అందించారు. బుధవారం రమేష్ నివాసం వద్ద ముస్లిం సోదరులకు గ్యార్మీ సందర్భంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అంబారపు వీధికి చెందిన ప్రమీల రాయల్‌కు కుట్టు మిషన్ కొనుగోలు కోసం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. దీంతో పాటు వికలాంగుల క్రికెట్ అసోసియేషన్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆపదలో ఉన్న వారికి, అవసరమైన వారికి తనవంతు సహాయం అందించడం ద్వారా మున్నానగర్ రమేష్ సేవా తత్పరతను చాటుకుంటున్నారని పలువురు అభినందించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలవడం, యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడం తన లక్ష్యమని ఈ సందర్భంగా రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తొండపు నాటి గురుమూర్తి, బాశెట్టి శ్రీదేవి, వినోద్ కుమార్ జిలాన్ భాష తదితరులు పాల్గొన్నారు.



# ఆర్నాబ్ తుఫాన్‌పై ముందస్తు చర్యలు




- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

అనంతగిరి సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్,

అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం నేపథ్యంలో అనంతగిరి మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. గోస్తనీ నది పరిసర ప్రాంతాలైన కాశీపట్నం, పల్లంవలస, కాటిమానువలస, సారవాణిపాలెం, సీతంపేట గ్రామాల్లో బుధవారం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.బుధవారం వారపు సంత కావడంతో కాశీపట్నం సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్. రమ్య, వీఆర్వో ఎల్.బి. అనిల్ గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రావద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, నదులు, వాగులు, ఇతర ప్రమాదకర ప్రాంతాల వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ఎస్. శ్రీదేవి, హార్టికల్చర్ అసిస్టెంట్ ఏ. సునీల్, డీఏ ఏఎస్ క్రిష్ణ, వీఆర్ఏ డి. రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎనిమిదవ రోజు చేరిన వీఆర్ఏల నిరసన.



పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 23 అనంత జన శక్తి న్యూస్.

పుట్టపర్తి తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏల నిరసన ధర్నా కార్యక్రమం బుధవారం 8వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని పుట్టపర్తి మండల రైతులు పలువురు సందర్శించి వీఆర్ఏలకు దీక్ష శిబిరంలోసంఘీభావాన్ని తెలిపారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ తరహాలో వేతన స్కేల్ అమలు చేయాలి.అర్హులైన ప్రతి ఒక్కరికి జీవో ప్రకారం వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలనీ, నామినీ వీఆర్ఏలల నియామకాలను పూర్తి చేయాలి.ప్రభుత్వం వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి వీఆర్ఏల డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అమలు చేయాలి . ఈ మేరకు వీఆర్ఏల జిల్లా అధ్యక్షులు పెద్దన్న జిల్లా పర్యటనకు వచ్చిన ఐటీ విద్యాశాఖ మంత్రి కి వీఆర్ఏల సమస్యలపై మంగళవారం వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల మండల నాయకులు చంద్ర చిన్న ఓబులప్ప మహేష్ ,నరసింహ, పోతులయ్య సమితజ్ ,వెంకటలక్ష్మి ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మవాటూరు, నాగళూరు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ తనిఖీ



- రీ-సర్వే పనుల వేగవంతానికి ఆదేశాలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పెనుకొండ,సెప్టెంబర్,23:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ పెనుకొండ డివిజన్ పరిధిలోని మవాటూరు మరియు నాగళూరు గ్రామాల్లో పర్యటించి, అక్కడ జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా రీ-సర్వేలో ఎదురవుతున్న ఉమ్మడి ఎల్‌పీఎంల విభజన (Splitting of Joint LPMs) పనుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు.భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి ఒక్కరి స్థలానికి స్పష్టమైన హద్దులు నిశ్చయించి, డిజిటల్ రికార్డులను పక్కాగా సవరించాలని అధికారులను ఆదేశించారు.పర్యటనలో భాగంగా జాయింట్ కలెక్టర్ స్థానిక రైతులతో నేరుగా మాట్లాడారు. రీ-సర్వే సమయంలో భూమి హక్కులు, ఖాతాల విభజనలో ఎదుర్కొంటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి మరియు సరిహద్దు వివాదాలు త్వరగా పరిష్కారం కావడానికి రైతులందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అనంతరం క్షేత్రస్థాయి రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమావేశమై జాయింట్ ఎల్‌పీఎం ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి తగిన సూచనలు జారీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పెనుకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆనంద్ కుమార్ , పెనుకొండ తహశీల్దార్ స్వాతి , గ్రామ సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ అధికారులు మరియు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలోనినో వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి



- సిపిఎం.

రాప్తాడు సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్

రాప్తాడు మండలం హంపాపురంలో సిపిఎం బృందం,రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు,జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఎల్నినో వర్ష భావం వీటి ప్రభావం కారణంగా, కరువు జిల్లాల పర్యటనలో భాగంగా హంపాపురం గ్రామం నందు వేరుశనగ పంట,టమాటా నష్టపోయిన రైతు నాగేష్ పొలాన్ని పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా పంట పచ్చదనమే తప్ప ఇందులో ఒక్క కాయ కూడా కాసే పరిస్థితి లేదని, రైతు నాగేష్ 1,70,000 రూపాయలు పెట్టి వేసిన పంట దాదాపు 90% నష్టపోయిందని, రైతుకు చాలా అన్యాయం జరిగిందంటూ, వర్షాలు సకాలంలో పడనందున రైతులకు పంటల సీజన్ తప్పిపోవడం వలన ఇక ఎన్ని వర్షాలు పడినా ప్రతి చెట్టుకు ఒక గింజ కూడా కాసే పరిస్థితి లేదన్నారు.ఈ పంటలను కాపాడుకొనుటకు రైతు నగేష్ లక్షలు ఖర్చు చేసితన పొలంలో 600 అడుగులకు పైగా బోర్ వేశాడు వేసినప్పటికీ ఒక్క చుక్క నీరు కూడా పడలేదన్నారు. అలాగే జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య మాట్లాడుతూ లక్ష రూపాయలకు పైగా బోర్ ఖర్చులు రైతుకు భారంగా మిగిలి నష్టపోయాడన్నారు. ప్రభుత్వం మాత్రం రైతులను ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అలాగే జిల్లాలో ప్రతి రైతు కూడా వివిధ పంటలు సాగు చేసి బోర్లు కూడా వేసి, నీళ్లు పడక నష్టపోయారని అన్నారు . ఇలా నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం రైతుల రుణాలను , , మాఫీ చేసి, అలాగే నష్టపోయినటువంటి రైతులకు కొత్త రుణాలు ఇప్పించి, పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకి 50 వేల చొప్పున ప్రభుత్వంనష్టం పరిహారం,ఉపాధి పనులు విరివిగా కల్పించాలని, కౌలు రైతులకు నష్ట పరిహారం, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం, దానిమ్మ, చీనీ తోటల రైతులను ఆదుకోవాలని రుణమాఫీ ప్రకటించాలంటూ, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు,, జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప,, కార్యదర్శివర్గ సభ్యులు,, బాల రంగయ్య,,,చంద్రశేఖర్ రెడ్డి,, జిల్లా కమిటీ సభ్యులు టి రామాంజనేయులు,, మండల నాయకులు పోతులయ్య,, రైతులు నాగేష్,, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పరిటాల రవి, లోకేష్ బాబు గురించి మాట్లాడే స్థాయి నీకు లేదు

- ప్రకాష్ రెడ్డిపై రాప్తాడు మండల టిడిపి నాయకులు ఆగ్రహం
- ఐదేళ్లపాటు ఏ గాడిద పళ్లు తోముతుంటివి ప్రకాష్ రెడ్డి
- అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు నోరు మెదపలేదు రమణ
- పేరూరు ప్రాజెక్టు కాలువ పూర్తి చేసి చూపిస్తామన్న టిడిపి నాయకులు

రాప్తాడు సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్



మాజీ మంత్రి పరిటాల రవీంద్ర, టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గురించి మాట్లాడే స్థాయి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి లేదని రాప్తాడు మండల నాయకులు అన్నారు. ప్రకాష్ రెడ్డి తో పాటు వైసిపి నేత కే.వీ.రమణ చేస్తున్న వ్యాఖ్యల మీద వారు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడు టిడిపి కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ పర్యటనకు వచ్చిన అశేష జనవాహినిని చూసి ఓర్వలేకనే ప్రకాష్ రెడ్డి, ఆ పార్టీ జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి కరవు గురించి, రైతుల గురించి మాట్లాడే కనీస నైతిక అర్హత లేదన్నారు. నియోజకవర్గ ప్రజలు కరోనా కష్టాల్లో ఉంటే రెండేళ్లపాటు ఇంట్లో దాక్కున్న చరిత్ర నీది కాదా ప్రకాష్ రెడ్డి? ఆ తర్వాత మిగిలిన మూడేళ్ల కాలంలో రాప్తాడులో భూ అక్రమాలకు, దౌర్జన్యపు సెటిల్మెంట్లకు పాల్పడింది నిజం కాదా? అని నిలదీశారు. రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఐదేళ్ల కాలంలో రాప్తాడుకు ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి కీలకమైన పేరూరు ప్రాజెక్టును వైసీపీ హయాంలో పూర్తిగా గాలికొదిలేశారని.. ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకెళ్లలేదని, ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీరు ఇవ్వలేకపోయారని మండిపడ్డారు. చివరికి తన సొంత గ్రామానికి కనీసం రోడ్డు కూడా వేసుకోలేని చేతకాని దద్దమ్మ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికార ప్రతినిధి కేవీ రమణ వైఖరిపై టిడిపి నాయకులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో జిల్లా అతలాకుతలమవుతుంటే, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం నోరు మెదపని కేవీ రమణ.. ఇప్పుడు ప్రతినిత్యం ప్రభుత్వంపై, లోకేష్ గారి పర్యటనలపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో జిల్లాకు ఒక్క పరిశ్రమ రాకపోయినా, యువత వలసలు పోతున్నా ఏనాడూ ప్రశ్నించని కేవీ రమణకు ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే హక్కు లేదన్నారు. పరిటాల రవీంద్ర చరిత్ర గురించి మాట్లాడే స్థాయి తోపుదుర్తికి లేదని హెచ్చరించారు. ఫ్యాక్షనిజం, రౌడీయిజంతో భూములు లాక్కున్న చరిత్ర తోపుదుర్తి కుటుంబానిదైతే.. పేద ప్రజల గుండెల్లో నిలిచిపోయిన త్యాగాల చరిత్ర పరిటాల రవిదని స్పష్టం చేశారు. నారా లోకేష్ రాప్తాడు అభివృద్ధికి, ఇక్కడి కరవు నివారణకు స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారని.. మీలాగా విగ్రహాలు పెట్టి ఊరుకునే రకం కాదని హితవు పలికారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు ప్రజలు వైసీపీకి మళ్లీ డిపాజిట్లు కూడా దక్కకుండా బుద్ధి చెప్పడం ఖాయమని టిడిపి నాయకులు హెచ్చరించారు. పేరూరు ప్రాజెక్టు పూర్తి చేసి చూపిస్తామని కూడా వారు స్పష్టం చేశారు....

# 62డివిజన్లు, 4పంచాయతీల్లో విజయమే మన లక్ష్యం

- నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుంది
- పార్టీలో విభేదాలకు తావుండకూడదన్న ఎమ్మెల్యే

అనంతపురం సెప్టెంబర్ 23,అనంత జనశక్తి న్యూస్



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 62 డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో బుధవారం నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ఆలయ కమిటీ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్టీ శ్రేణులకు అత్యంత స్పష్టమైన, బలమైన దిశానిర్దేశం చేశారు. పార్టీలో ఎక్కడా, ఏ స్థాయిలోనూ అంతర్గత విభేదాలు ఉండటానికి వీల్లేదన్నారు. ప్రతి డివిజన్, ప్రతి పంచాయతీలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, ఒకే తాటిపై నడవాలని సూచించారు. మనమంతా కలిసికట్టుగా, ఐక్యంగా ముందుకు సాగితేనే స్థానిక ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పగలమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. మీకు ఏ కష్టం వచ్చినా, ఏ అర్ధరాత్రి సమస్య వచ్చినా మీకు అండగా ఉంటానన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ముందే గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం సూచనలు, ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలిచి వైసీపీకి బుద్ధి చెబుదామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు బుగ్గయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, జిల్లా కమిటీ నాయకులు కృష్ణకుమార్, కంతాదేవి, దబ్బర కుమారస్వామి నాయుడు, భూలక్ష్మి, క్లస్టర్ ఇంచార్జ్ లు సరిపూటి రమణ, రాజారావు, సాకే లక్ష్మీనరసింహ, డిష్ నాగరాజు, కృష్ణం రఘు, కాయగూరల శ్రీధర్, చేపల హరి, పొట్లూరి కేశవ నాయుడు, గోపాల్ గౌడ్, డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, పరమేశ్వర్, పోతుల లక్ష్మీనరసింహులు, కొండన్న, బొమ్మినేని శివ, బెస్త పవన్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్లు అమిలినేని నరేంద్ర చౌదరి, పాలాది పద్మజ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నతనంలోనే కండరాల క్షీణత గుర్తింపుపై ప్రత్యేక దృష్టి

- మంత్రి కందుల దుర్గేష్
- అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర సేవలు అభినందనీయమని కొనియాడిన మంత్రి దుర్గేష్

అమరావతి సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్



అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యుల కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 30 న మంగళగిరిలోని 'గోపు గ్రాండ్' వేదికగా జరగనున్న 'సాహస్-2026' (వీల్స్ ఆఫ్ కరేజ్) కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రి దుర్గేష్ కి ఆహ్వాన పత్రిక అందజేశారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల కోసం ఈ కార్యక్రమంలో 130 ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌లను పంపిణీ చేయనున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... స్వయంగా దివ్యాంగురాలైనప్పటికీ, తోటి మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శోభారాణి సుంకర చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కండరాల క్షీణత బారిన పడిన వారికి అండగా నిలవడం, వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు. చిన్నతనంలోనే ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తగిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఇటువంటి మహత్తర లక్ష్యంతో ముందుకు వెళ్తున్న సంస్థలకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయి చేయి కలిపి పనిచేస్తే భవిష్యత్తులో ఈ సవాల్‌ను సమర్థవంతంగా అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నారు. అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ద్వారా శోభారాణి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, తాను స్వయంగా పరిశీలించామని మంత్రి తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేస్తున్న ఈ బృహత్ ప్రయత్నాలు పూర్తి సత్ఫలితాలనివ్వాలని, మరిన్ని విజయాలను సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

# విద్యార్థులను తమ కన్నబిడ్డల్లా టీచర్లు చూసుకోవాలి





- బాల్యవివాహాలను పూర్తిగా నివారించాలి
- సమాజ సహకారంతోనే బాలల హక్కుల పరిరక్షణ
- బాలల స్నేహపూర్వక జిల్లాగా అనంతపురంను తీర్చిదిద్దేందుకు అంతా కలిసి పని చేద్దాం
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన రావు లు

**అనంతపురం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థులను ఉపాధ్యాయులు తమ కన్న బిడ్డల్లా చూసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన రావు సూచించారు. బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన రావు అనంతపురం జిల్లా, బుక్కరాయ సముద్రం లోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల, అనంతపురం పట్టణంలోని బాలసదనం, శిశు గృహ, జిల్లా జైలును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.... ఎంతోమంది పేద విద్యార్థిని విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలలో చదువుతుంటారని విద్యార్థులను ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బంది తమ కన్నబిడ్డల్లా చూసుకొని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. విద్యార్థులను చిన్న చిన్న విషయాలకు భయభ్రాంతులకు గురి చేయకుండా వారికి ఏమి అవసరమో అధికారులను అడిగే ధైర్యాన్ని వారికి కల్పించాలన్నారు. అప్పుడే విద్యార్థులు స్వేచ్ఛగా చదువుకోగలిగే అవకాశం వస్తుందన్నారు. ప్రభుత్వం వసతి గృహాలలో చదివే విద్యార్థులకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తమ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని పలువురు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో కమిషన్ సభ్యులు మొక్కలు నాటారు. కొంతమంది చిన్న వయసులోనే బాల్య వివాహాలు చేసుకోవడం జరుగుతోందని బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ముఖ్యంగా ఎన్జీవోలు బాల్య వివాహాలు అధికంగా జరిగే ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించి వివాహం చేసుకోబోయే అమ్మాయిలకు అబ్బాయిలకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. చాలా పాఠశాలల్లో కేవలం పెళ్లి కోసమే అమ్మాయిలు డ్రాప్ అవుట్ అవుతుంటారని తెలిసి తెలియని చిన్న వయసులో బాలికలు వివాహం చేసుకోవడం జీవితంలో ఎన్నో రకాలుగా అవరోధం కలుగుతుందన్నారు. బాల్యవివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొన్న వారికి జైలు శిక్ష, జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు.అనంతపురం పట్టణంలోని శిశు గృహను, బాల సదనంను ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు తనిఖీ చేసి అక్కడ పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించి సక్రమంగా విధులు నిర్వహించాలని వారికి సూచించారు.

శిశు గృహ నిర్వహణ తీరు సంతృప్తికరంగా ఉండేటట్లు సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆహారం ఎలా ఇస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడికి ఎంతోమంది అమ్మ...నాన్న లేని పిల్లలు వస్తుంటారని, వారికి మీరే అమ్మా నాన్నలై చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఆత్మ సంతృప్తితో పిల్లలకు సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. అనంతరం అనంతపురం జిల్లా జైలును తనిఖీ చేసి అక్కడున్న మహిళ రిమాండ్ ఖైదీల పిల్లలు బాగోగులు ఎలా ఉన్నాయి వారి హక్కులు, వారి సంరక్షణ ఎలా ఉందని జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ సాజిదా బేగం, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ అధికారిని తస్లీమ్, డీసీపీవో, చైల్డ్ హెల్ప్ లైన్, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎస్కేయూలో ఎంపికలు




**అనంతపురం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్**

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 2027 గణతంత్ర దినోత్సవ పరేడ్ శిబిరానికి సంబంధించిన ఎంపిక ప్రక్రియను బుధవారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ ఎంపికలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందుతాయని తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకమైనదని పేర్కొన్నారు.జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎన్.ఆర్. సదాశివరెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో స్వచ్ఛంద సేవకులుగా చేరడం అదృష్టంగా భావించాలన్నారు. 'నా కోసం కాదు.. మీ కోసం' అనే నినాదం భారతీయ జ్ఞాన పరంపర సారాంశమని తెలిపారు. మనిషి తన కోసం కాకుండా ఇతరుల మేలు కోసం జీవించినప్పుడే మానవ జీవితానికి సార్ధకత చేకూరుతుందని అన్నారు .ఈ ఎంపిక ప్రక్రియలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన డిగ్రీ, జూనియర్ కళాశాలల 120 జాతీయ సేవా పథకం విభాగాల నుంచి 150 మంది స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభ, శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పరిశీలించి వివిధ దశల్లో ఎంపికలు నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన జాతీయ సేవా పథకం ప్రాంతీయ సంచాలకుడు సైదా నాయక్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు.ఎంపికైన విద్యార్థులు 2027 జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సేవా పథకం గణతంత్ర దినోత్సవ పరేడ్ శిబిరంలో పాల్గొనే అవకాశం పొందనున్నారు. జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించడంపై విశ్వవిద్యాలయ అధికారులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎన్.ఆర్. సదాశివరెడ్డి, వివిధ కళాశాలల కార్యక్రమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్కేయూ నుంచి జాతీయ స్థాయి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు విద్యార్థులు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి, అనంతపురం జిల్లాకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు.

# మారెమ్మ జాతరకు హాజరైన ఉమామహేశ్వర నాయుడు.

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్**

పట్టణ పరిధిలోని గరుడాపురం గ్రామ పంచాయతీ ఈరన్నకుంటకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు వారి గ్రామంలో జరుగుతున్న మారెమ్మ జాతరకు హాజరై నాయకుల కుటుంబాల ఆతిథ్యాన్ని స్వీకరించిన కళ్యాణదుర్గం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు మరియు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...




# క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన



**కొత్తచెరువు రూరల్ సెప్టెంబర్ 23**
**అనంత జనశక్తి న్యూస్.**

కొత్తచెరువు మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని వైద్య శాఖ అధికారులు డాక్టర్ సురేష్,డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే చేయడం జరిగినది ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రిపోర్టును రెండు నిమిషాలలోనే తెలియజేయబడుతుందనీ దీని ముఖ్య ఉద్దేశం త్వరితగతిన టీబీ నిర్ధారణ చేయడానికి అలాగే నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ఉన్న చోటే ఎక్స్రే పరీక్ష చేసి వెంటనే రిపోర్టు ను తెలియజేయవచ్చు, టీబీ ముఖ్య లక్షణాలు రెండు వారాల మించి దగ్గు దగ్గినప్పుడు గళ్ళతోపాటు రక్తం పడడం సాయంత్రం పూట తరచుగా జ్వరం రావడం చెమటలు పట్టడం ఆకలి మందగించడం బరువు తగ్గడం చక్కెర వ్యాధి గ్రస్తులకు 60 ఏళ్ల పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ధూమపానం పొగాకు సేవించు వారికి ఇటుక బట్టి లో పనిచేసే వారికి పరిశ్రమల్లో పనిచేసే వారికి కంకర పని చేయు వారికి ఎక్కువ టీబీ ఉండవచ్చని ఇలాంటివారు ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా గళ్ళ పరీక్ష చేయించుకుని టీబీ నిర్ధారణ అయినచో ఆరు నెలల చికిత్స ఉచితంగా అందజేస్తారు .కేంద్ర ప్రభుత్వం ఆరు నెలల కాలానికి 6000 నేరుగా వారి అకౌంట్లోనే జమ చేయబడును ఇది వాళ్ళ పౌష్టికాహారం కోసం ఇవ్వడం జరుగుతుంది . ఈ కార్యక్రమం నందు జిల్లా టిబి యూనిట్ సూపర్వైజర్ ఆబిద్ భాష, టిబిహెచ్ వి రాజేశ్వరి,సిహెచ్ఓ శైలజ , ఏఎన్ఎం ధరణి ఆశా కార్యకర్తలు భాగ్యమ్మ ,రమాదేవి,

# ఎంపీపీకి ఘనంగా సన్మాన కార్యక్రమం

**ఆమడగూరు సెప్టెంబర్23( అనంత జనశక్తి న్యూస్)**

అమడగూరు మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో,ఎంపీపీ గజ్జల ప్రసాద్ రెడ్డికి నేడు అనగా 24 తేదీ 9వ నెల 2026 సంవత్సరం పదవీకాలం ముగియంతో స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శకుంతల ఏవో మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మరియు తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు గజ్జల ప్రసాద్ రెడ్డికి ఘనంగా పూలమాల శాలువాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ 2021సం 9వ నెల 24వ తేదీ మండల ఎంపీపీగా బాధితులు చేపట్టి మండలంలో రాజకీయాలకు ఆ తీతంగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి న్యాయం చేశారని తన వంతు మండలంలో అభివృద్ధి బాటలో నడిపించారని రాబోవు రోజుల్లో మరెన్నో పదవులు చేపట్టి ప్రజలకు మంచి చేయాలని వారు తెలిపారు అనంతరం ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఎంపీపీగా బాధితులు చేపట్టినప్పటి నుండి రాజకీయాలకు ఇటు బాద్య తులకు ఎన్నో ఇబ్బందులకు గురి అయినా ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండాలని ఒక ముఖ్య ఉద్దేశంతో పార్టీ కట్టుబాట్లతో గత ఐదు సంవత్సరములు బాధ్యతలు చేపట్టి ప్రతి ఒక్కరిని కలుపుకొని మంచి చేశానని కొందరు నా గురించి చెడుగా అభిప్రాయాలు చేసుకొని రాజకీయాలు చేశారని అలాంటి వారుకీ కూడా నేను ఏ రోజు హాని తలపెట్టలేదని రాజకీయంలో పదవులు కంటే ప్రజలే ముఖ్యమని పది మందిని కలుపుకుని పోయే వాడే నాయకుడని నా రాజకీయ జీవితమంతా వైసిపి పార్టీలోనే కొనసాగుతానని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ సిబ్బంది రాజశేఖర్



మద్దిలేటి రెడ్డి జై కృష్ణ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఐకెపి ఎపిఎం భారతి సిబ్బంది ఎన్ ఆర్జిఎస్ ఏపీవో మధుసూదన్ రెడ్డి మరియు సిబ్బంది మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ కృష్ణమూర్తి కసంద్రం వైసిపి మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి అమడగూరు మాజీ సర్పంచ్ షబ్బీర్ బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రామ్ శెట్టి వేమ నారాయణ సీనియర్ నాయకులు ఐ రాము ఉపాధ్యక్షులు డాక్టర్ సమరం అలియాస్ లక్ష్మీనారాయణ జవకల అశ్వత్ నారాయణ రమణప్ప గంగులప్ప భాస్కర్ రెడ్డి శంకర రాజారెడ్డి సీతిరెడ్డి పెద వెంకటరెడ్డి ఆది ఇతర వైసిపి కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి గజమాలతో తస్కరిస్తున్న అధికారులు నాయకులు..



**గాండ్లపెంట 23 , అనంత జనశక్తి న్యూస్,**

ఎంపీపీ పదవి చేపట్టిన 16 నెలలోనే మండలాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించారని ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి మండల అధికారులు నాయకులు ప్రశంసాలు కురిపించారు మండల పరిసత్తిలో ఎంపీపి ఎంపీటీసీ మండల కోఆప్షన్ సభ్యులు పదవి కాలం ముయుడంతో మండల అధికారులు నాయకులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి గజమాలతో తస్కరించారు ఎంపీటీసీ సభ్యులు భారతి జయరామకృష్ణ మండల కో ఆప్షన్ సభ్యులు అమీర్ భాష దుశ్యాలువ పూలమాలతో తస్కరించారు మండల అభివృద్ధి చేసిన సేవలను గుర్తు చేశారు ఎంపీపీ పదవి చేపట్టిన 16 నెలలు కాలంలో మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు ఎదుటి లేకుండా దాదాపు 70 బోరు బావులు తవ్వించి మండలంలోని నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు అలాగే జీనులకుంట నుంచి పోతావాండ్లపల్లి ఎన్నో ఏళ్లుగా రహదారి సమస్యతో ఉన్న గ్రామానికి సీసీ రహదారి వేయడానికి కృషి చేశారని తెలిపారు పాఠశాల రూ 1.50 కోట్లు వెచ్చించి రహదారి గోడ నిర్మాణానికి చొరవ చూపారని కల్వర్టులు సిసి రహదారులు వేయించి మండలాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించడంతో తమ వంతు కృషి చేశారని అధికారులు నాయకులు ప్రశంసలు కురిపించారు వచ్చే స్థానిక ఎన్నికలలో మరోసారి కూటమి ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి కోరారు ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ వెంకట ప్రసాద్ సొసైటీ అధ్యక్షుడు రామానుజన్ రెడ్డి ఎంపీడీవో రామకృష్ణారెడ్డి విద్యాధికారి రామకృష్ణ నాయక్ పి ఆర్ జె ఈ రెడ్డి వరప్రసాద్ ఉపాధి పంచాయతీ అధికారులు ఇబ్బంది కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# ఇంజనీరింగ్ శాఖల పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, సెప్టెంబర్ 23 :అనంత జనశక్తి న్యూస్**



ఆయా ఇంజనీరింగ్ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి సకాలంలో గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఆర్.అండ్.బి, పంచాయతీ రాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఇంజనీరింగ్ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అన్ని రకాల ఇంజనీరింగ్ పనులు ఏ దశలో ఉన్నాయి, ఎంత పని పూర్తి అయ్యింది ఆరా తీసి, ఆయా పనులను వేగవంతంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయలని ఆదేశించారు. ఆర్.అండ్.బి పరిధిలో చేపట్టిన రహదారులు, బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సాస్కి, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన 3, నాబార్డు కింద కింద చేపట్టిన పనులను కేటాయించిన లక్ష్యం మేరకు గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఎంపీ నిధుల కింద మంజూరైన పనులలో పురోగతి చూపించకపోతే పీఆర్ ఈఈపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో మంజూరైన అన్ని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ యూనిట్లను ఈనెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని, దేవాలయాలలో పురోగతిలో ఉన్న పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని టాయిలెట్లు మరియు తాగునీటి సౌకర్యాల పనులను ఈనెల 30 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రారంభంకాని ఎంపీ నిధుల పనులన్నింటినీ వచ్చే వారంలోగా ప్రారంభించాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద FHTC లక్ష్యమైన 20,633 కనెక్షన్ల పనులను వచ్చే మార్చి నెల నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపిఎస్ఎంఐడిసి, హెచ్ఎన్ఎస్ఎస్, ఏపిఈడబ్ల్యుఐడిసి, హెచ్ఎల్సి, ఇతర ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టైం లైన్ ప్రకారం అన్ని పనులను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయడంపై క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, పిఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, సీపీఓ బాలాజీ నాయక్, మైన్స్ ఏడి ఆదినారాయణ, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆయా ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉలవల విత్తనాల పంపిణీ




- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో ప్రారంభం.....
- వర్షా న్ని సద్వినియోగం చేసుకోవాలని హరీష్ బాబు సూచన....

**ధర్మవరం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ఇటీవల కురిసిన వర్షా లను సద్వినియోగం చేసుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు సూచించారు. పోతుకుంట రైతు సేవా కేంద్రంలో బుధవారం ఉలవల విత్తనాల పంపిణీని హరీష్ బాబు, ఏపీ సీడ్స్ డైరెక్టర్ కాటమయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు రామాంజనేయులు ప్రారంభించారు.

ధర్మవరం మండలంలో ఇటీవల 44.6 మి.మీ. వర్షపాతం నమోదైందని, నేలలోని తేమ ఉలవల సాగుకు అనుకూలంగా ఉందని హరీష్ బాబు తెలిపారు. రైతులు భూములను ఖాళీగా ఉంచకుండా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉలవల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆధార్, పాస్‌బుక్, మొబైల్ ఫోన్‌తో నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని సూచించారు. సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, గ్రామ వ్యవసాయ సహాయకుడు కిషోర్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల ఆరోగ్యంపై మంత్రి సత్యకుమార్ ప్రత్యేక శ్రద్ధ




ధర్మవరం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్ :

పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా పాత్రికేయుల కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో సెప్టెంబర్ 26న ఉదయం 9 గంటలకు పుట్టపర్తి సాయి ఆరామం హోటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వైదేహి, బసవతారకం, ఎస్వీఐఎంఎస్, కిమ్స్ సవీరా ఆసుపత్రుల నిపుణులు వైద్య సేవలు అందించనున్నారు. గుండె పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్‌తో పాటు ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్, మామోగ్రఫీ, పాప్ స్మియర్, రొమ్ము పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం కోరింది.

# టిడిపి నేత పరిటాల శివ కుమార్ కుటుంబ సభ్యులకు దేవినేని, తంగిరాల పరామర్శ



కంచికచర్ల, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్

కంచికచర్ల మండలం, పరిటాల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పరిటాల శివ కుమార్ కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య పరామర్శించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులతో కలిసి సుమతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# సంత ముగిసిన తర్వాత కూలిన భారీ చింతచెట్టు.. తప్పిన పెను ప్రమాదం



అనంతగిరి, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ సమీపంలోని ఎస్.కోట–అరకు ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం భారీ చింతచెట్టు కూలిపోయింది. వారపు సంత సాయంత్రం 5 గంటలకు ముగియడంతో ఆ సమయంలో చెట్టు కింద వ్యాపారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.అదే సమయంలో వాహనాల రాకపోకలు కూడా తక్కువగా ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని గ్రామస్తులు పేర్కొన్నారు.సంతలో వ్యాపారాలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో ఈ భారీ చెట్టు కూలి ఉంటే వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.సమాచారం అందుకున్న ఆర్అండ్‌బీ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని రహదారిపై పడిన చెట్టును తొలగించే పనులు చేపట్టారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

# విన్నారు.. స్పందించారు.. పరిష్కరించారు





- పిఠాపురం ప్రజా వినతులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణ స్పందన

పిఠాపురం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్

పిఠాపురం నియోజకవర్గం పర్యటన సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను బుధవారం స్వయంగా పరిశీలించిన పవన్ కళ్యాణ్ తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా, మానవతా దృక్పథంతో పని చేయాలని స్పష్టం చేశారు.

**ఆరు గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు**

గ్రామాల్లో స్థానిక పాలనను మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు తమ గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు ఏర్పాటు చేయాలని అమరవిల్లి, కొమరగిరి, గోర్స, నవఖండ్రవాడ, చేబ్రోలు, దుర్గాడ గ్రామాల ప్రజలు పవన్ కళ్యాణ్ ని కోరారు. ఈ మేరకు తమ సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలను సమర్పించారు. ప్రజల విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన పవన్ కళ్యాణ్ , ఆయా గ్రామాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ.32 లక్షల చొప్పున, మొత్తం ఆరు భవనాల నిర్మాణానికి రూ.1.92 కోట్ల నిధులను కేటాయించారు. గ్రామ పంచాయతీ భవనాల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియను వెంటనే చేపట్టడంతోపాటు, నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**గొల్లప్రోలు డ్రైనేజీల సమస్యకు సత్వర స్పందన**

గొల్లప్రోలు మున్సిపాలిటీలోని డ్రైనేజీ వ్యవస్థను పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాలు కురిసిన సమయంలో డ్రెయిన్లు పొంగిపొర్లడంతో మురుగు నీరు ఇళ్లలోకి, రహదారులపైకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న పవన్ కళ్యాణ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు . సమస్యకు పరిష్కారం చూపేందుకు సుమారు రూ.4.50 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. అదే విధంగా రాయవరం రోడ్డు, తాటిపర్తి రోడ్డు, మెయిన్ రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను కూడా స్థానికులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాడా, మున్సిపల్ నిధులను వినియోగించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన డ్రైనేజీ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గొల్లప్రోలు మున్సిపాలిటీలో పెరుగుతున్న పారిశుధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, శానిటేషన్ పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రూ. 25 లక్షలతో జేసీబీని మంజూరు చేశారు.వలస కూలీల సమస్యలపై ఆరా

నియోజక వర్గం పరిధిలో పని చేస్తున్న వలస కూలీలతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీరు, తాత్కాలిక వసతి, విద్యుత్ సౌకర్యం, రేషన్ అందించాలని వలస కూలీలు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్ వలస కూలీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. తాగు నీరు, తాత్కాలిక వసతి, విద్యుత్, రేషన్ వంటి సౌకర్యాలు అందేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఆలయాల అభివృద్ధికి రూ.1.50 కోట్లు కేటాయింపు

ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించిన పవన్ కళ్యాణ్ ప్రజల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దేవాదాయ శాఖ అధికారులతో మాట్లాడి, ఆయా ఆలయాల అభివృద్ధి పనులకు మొత్తం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించేలా చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగా విరవలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కోనేరు అభివృద్ధి పనులకు రూ.కోటి, కొండెవరం కోదండ రామాలయం అభివృద్ధికి రూ.25 లక్షలు, ఫక్రుద్దీన్‌పాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, కనకదుర్గ ఆలయాల అభివృద్ధికి రూ.25 లక్షలు కేటాయించారు. కొండెవరం విద్యుత్ సమస్యకు పరిష్కారం

యు.కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామంలోని ఇందిరా కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు చాలాకాలంగా అధికారులను కోరుతూ వస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ఈ సమస్యను గ్రామస్థులు పవన్ కళ్యాణ్ గారి దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రం సమర్పించారు. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్య కావడంతో ఆయన తక్షణమే స్పందించి, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారం లభించడంతో కొండెవరం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

పిఠాపురం-రాజమండ్రి బస్సు సర్వీసు ఏర్పాటు

పిఠాపురం నుంచి రాజమండ్రికి నేరుగా బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పవన్ కళ్యాణ్ కి విజ్ఞప్తి చేశారు. ప్రజల అభ్యర్థనపై స్పందించిన పవన్ కళ్యాణ్ ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో మాట్లాడి, పిఠాపురం-రాజమండ్రి మధ్య బస్సు సర్వీసును త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపట్టారు.వీటితోపాటు ఎఫ్‌కే పాలెం ప్రాంతంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ఈబీసీ కాలనీ వరకు 0.98 కి.మీ మేర డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు అర్జీ సమర్పించగా, ప్రజల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న పవన్ కళ్యాణ్ రూ.1.35 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపారు.చందుర్తి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు కోరగా 162 చదరపు మీటర్ల స్థలంలో నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సర్పవరం ప్రాంతంలో ప్రజల రాకపోకలకు సౌకర్యంగా సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు అర్జీ సమర్పించగా రూ.6 లక్షలతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే వాకతిప్ప ప్రాంతంలో 0.2 కి.మీ మేర సీసీ డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తులు కోరగా రూ.10 లక్షలతో పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చారు. కొండెవరం ప్రాంతంలో 1.7 కి.మీ మేర ప్రధాన సీసీ డ్రైనేజీ నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేయగా, వారి అభ్యర్థనను పరిశీలించి రూ.1.20 కోట్లతో పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేశారు. పింఛన్లు మంజూరు చేయాలని పలువురు పవన్ కళ్యాణ్ కి అర్జీలు సమర్పించారు. వారి అభ్యర్థనలను పరిశీలించిన పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించి, అర్హతను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అర్హతపై విచారణ నిర్వహించిన అధికారులు, పింఛన్ల మంజూరు కోసం ప్రతిపాదనలను హెడ్ ఆఫీసుకు పంపించారు.

# కూలిన చింతచెట్టు తొలగింపునకు పోలీసుల చర్యలు

కాశీపట్నం, అనంత జనశక్తి న్యూస్, సెప్టెంబర్ 23:

అనంతగిరి మండలం కాశీపట్నం సంత బజార్‌లో బుధవారం సాయంత్రం కూలిపోయిన భారీ చింతచెట్టును తొలగించేందుకు పోలీసులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు.రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో చింతచెట్టు నేలకొరిగింది. చెట్టు విద్యుత్ వైర్లపై పడటంతో వైర్లు తెగిపడ్డాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణహాని జరగలేదు.సమాచారం అందుకున్న అనంతగిరి ఎస్సై శంకర్రావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని చెట్టును తొలగించే పనులు చేపట్టారు. కాశీపట్నం యువకుల సహకారంతో జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, విద్యుత్ వైర్లకు మరింత ప్రమాదం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ తొలగింపు చర్యలు చేపట్టారు.



# కూటమి ఓటమే మన లక్ష్యంగా పని చేద్దాం...



## మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి..

నంద్యాల సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్

నంద్యాల పట్టణం నడిగడ్డలోని కేకే ఫంక్షన్ నందు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని1వార్డు నుండి 13 వార్డులలో వున్నా పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు.పార్టీ బలోపేతం, ప్రజలతో నిరంతర సంబంధాలు, స్థానిక సమస్యలపై అవగాహనతో ముందుకు సాగాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి విజయానికి కృషి చేయాలని శిల్పా రవి రెడ్డి కోరారు. రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ దేశం సుధాకర్ రెడ్డి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్లు మునయ్య,సాదిక్ బాషా,సమద్,అరిఫ్ నాయక్,గౌస్,చాంద్ బీ,కలం భాషా,తమీమ్,దండె సుధాకర్, జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, జిల్లా వైసీపీ సెక్రటరీ శివ నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి,నేరవాటి రవికుమార్, గన్ని కరీం, దండే శ్రీను, కాల్వ నాగరాజు మరియు వార్డు వైసిపి నాయకులు ఇంచార్జిలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# గరికిపాటి ఆధ్యాత్మిక ప్రవచనం

- కళాజ్యోతి శతవర్షో త్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం.....

ధర్మవరం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి న్యూస్ :



ధర్మవరం కళాజ్యోతి శతవర్షో త్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 28న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, మహాసహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాజ్యోతి నిర్వాహకులు తెలిపారు. ఈనెల 28వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు ధర్మవరం కళాజ్యోతి ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక, ధార్మిక అంశాలపై ప్రవచనం చేయనున్నారు. భక్తులు, ఆధ్యాత్మిక అభిమానులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# భోగాపురం To దిల్లీ మరో విమాన సర్వీసు

అనంతపురం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో సర్వీసుల సంఖ్య ఒక్కొక్కటిగా పెరుగుతోంది. ఇప్పటికే ఇక్కడ నుంచి దిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాలకు విమానాలతోపాటు సింగపూర్, బ్యాంకాక్‌కు అంతర్జాతీయ సర్వీసులు నడుస్తున్నాయి. తాజాగా ఆకాశ ఎయిర్ సంస్థ ఈనెల 25 నుంచి రోజూ దిల్లీకి రానూపోనూ సర్వీసు నడపనుంది. దిల్లీ విమానాశ్రయం నుంచి ఉదయం 5.55 గంటలకు బయలుదేరి 8.20 గంటలకు భోగాపురం వచ్చే విమానం.. తిరిగి ఉదయం 9.05 గంటలకు ఇక్కడ్నుంచి బయలుదేరి 11.30 గంటలకు దేశ రాజధాని చేరుకోనుంది. భోగాపురం విమానాశ్రయం నుంచి దిల్లీకి ఆకాశ ఎయిర్ నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనుండటం సంతోషకరంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.





# రోడ్డు భద్రతే ధ్యేయంగా.. జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**అనంతపురం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**

రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలే లక్ష్యంగా అనంతపురం జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు.ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసిన పోలీసులు వాహనదారుల పత్రాలను, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను క్షుణ్ణంగా పరిశీలించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలను గుర్తించి పలువురిపై కేసులు నమోదు చేశారు.

**నిబంధనలు పాటించాలి**

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో ప్రాణనష్టాన్ని నివారించుకోవచ్చని తెలిపారు.ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఇకపై కూడా చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# ఆసుపత్రి ఆవరణమే అపరిశుభ్రం.. రోగులకు ఇబ్బందులు



- ప్రధాన ద్వారం వద్ద మురుగునీరు.. చెత్తాచెదారంతో నిండిన ప్రాంగణం
- పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యమంటూ స్థానికుల ఆగ్రహం

**నల్లచెరువు, సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. రోగులకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రి పరిసరాల్లోనే చెత్తాచెదారం పేరుకుపోవడం, ప్రధాన ద్వారం వద్ద మురుగునీరు నిలిచి బురదమయంగా మారడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద మురుగునీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వాహనదారులు మురుగునీరు, బురదను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రి పరిసరాల దుస్థితిపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పారిశుధ్యంపై పట్టింపేది?**

ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణమే ఇలా అపరిశుభ్రంగా ఉంటే పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు ఎలా ఉంటాయంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**వర్షా కాలంలో మరింత ఆందోళన**

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తున్న వారికి అపరిశుభ్ర వాతావరణం మరిన్ని ఇబ్బందులకు దారితీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఆసుపత్రి ఆవరణాన్ని వెంటనే శుభ్రం చేసి, మురుగునీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరుతున్నారు.



# రాష్ట్రాల వారీగా బీజేపీ కొత్త ఇన్‌ఛార్జ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ కోఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బెంగాల్‌కు లాల్ సింగ్ ఆర్య, రాజేంద్ర సింగ్, పింకీ కుష్వాహా కోఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించనున్నారు.

దేశంలో కీలకంగా భావించే ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాలను జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే పర్యవేక్షించనున్నారు. జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజా సహకార బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంత్ జయ్ పాండా నియమితులవ్వగా.. అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తానవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కోఇన్‌ఛార్జ్‌లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక.. ఢిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా సీనియర్ నేత వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నంగ్యాల్, దర్శనా జర్దోష్ కోఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. బీజేపీ మరో ఉపాధ్యక్షుడైన రామ్ మాధవ్‌కు ఉత్తరాఖండ్ బాధ్యతలు అప్పగించగా.. అరవింద్ మీనన్, బాన్సురీ స్వరాజ్ ఆయనకు అసోసియేట్స్‌గా నియమితులయ్యారు. ఈ జాబితాలో తమిళనాడు బాధ్యతలను రామ్ మాధవ్‌కు కాకుండా ఇతర నాయకులకూ అప్పగించారు.

**మరోవైపు.. పార్టీ కమ్యూనికేషన్ విభాగంలోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా విభాగం, సోషల్ మీడియా యూనిట్‌ను కలుపుకునే కమ్యూనికేషన్ విభాగానికి అనిల్ బలూనీ సమన్వయకర్త నియమితులయ్యారు. ఇటీవల నేషనల్ మీడియా విభాగం కో-కన్వీనర్‌గా నియమితులైన ఆషిశ్ ఉషా అగర్వాల్‌కు కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.**

# ఘనంగా అభయ ఆంజనేయస్వామి 41వ రోజు మండల పూజ

- అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక హోమం,పూజలు.
- ఆలయ కమిటీ సభ్యులు
- మండల పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు.
- భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం.. తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు
- ప్రజలందరిపై అభయ ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలి: ఆలయ సేవకుడు శునకానంద

**ధర్మవరం సెప్టెంబర్ 23, అనంత జనశక్తి న్యూస్:**



శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని మారుతి నగర్ 37వ వార్డులో వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో 41వ రోజు మండల పూజ కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 37వ వార్డు ప్రజలు, టిడిపి నాయకులు, భక్తులు హాజరై పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.గత నెల ఆగస్టు 14వ తేదీన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించిన నేపథ్యంలో మండల పూజలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో తొలుత హోమాన్ని నిర్వహించి,ఆలయ కమిటీ సభ్యులు అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలయ సేవకుడు శునకానంద మాట్లాడుతూ....., మండల పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని తెలిపారు.స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన భక్తులు, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అభయ ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు అంగజాల ఓబులపతి,కాటా రమణ,ఆకుల శీనప్ప,అమర్,కాటా మారుతి,పాగొండ శీన,రెడ్డప్ప, సురేష్, భాస్కర్,మారుతి, సుధాకర్,అధిక సంఖ్యలో మహిళలు,భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఐఎన్ఎల్ భూముల ఈవేలంపై విశాఖలో పెట్టుబడిదారుల సమావేశం






- 459 భూ స్థలాలు.. 93,572 చదరపు గజాల భూముల వేలం
- విజయవాడలో 24న, హైదరాబాద్‌లో 25న పెట్టుబడిదారుల సమావేశాలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 23:అనంత జనశక్తి న్యూస్**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ భూముల ఈవేలానికి సంబంధించి జాతీయ భూముల నగదీకరణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విశాఖపట్నంలో పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించారు. కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ సంస్థ సమావేశంలో భవిష్యత్ వేలంలో పాల్గొనే పెట్టుబడిదారులు, అభివృద్ధిదారులు, ఇతర భాగస్వాములకు భూముల వివరాలు, వేలం ప్రక్రియపై అవగాహన కల్పించారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, గాజువాక ఆటోనగర్ ప్రాంతాల్లో ఉన్న 459 భూ స్థలాలను ఈవేలం ద్వారా విక్రయించనున్నారు. వీటి మొత్తం విస్తీర్ణం 93,572.21 చదరపు గజాలు. ఒక్కో స్థలం విస్తీర్ణం సుమారు 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది.ఈ భూముల్లో హెచ్‌బీ కాలనీలో 456 నివాస స్థలాలు సుమారు 87,949.77 చదరపు గజాల్లో ఉన్నాయి. గాజువాక ఆటోనగర్‌లో మూడు స్థలాలు సుమారు 5,622.44 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే రహదారులు, పౌర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.ఆటోనగర్‌లో బ్లాక్2లో 2,728 చదరపు గజాల విస్తీర్ణంలో ఒకే భాగంగా ఉన్న స్థలం, బ్లాక్3లో రెండు నివాస స్థలాలు కలిపి సుమారు 2,894.44 చదరపు గజాల భూములు వేలం జాబితాలో ఉన్నాయి.

**పారదర్శకంగా ఈ-వేలం**

ఈవేలం ప్రక్రియకు క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను లావాదేవీ సలహాదారుగా నియమించారు. వేలంలో పాల్గొనే వారి అర్హతలు, నమోదు విధానం, ధరావతు, నిబంధనలు, భూముల వివరాలపై సమావేశంలో అధికారులు వివరించారు.జాతీయ భూముల నగదీకరణ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రోహన్ చంద్ ఠాకూర్ మాట్లాడుతూ పెట్టుబడిదారులకు భూముల వివరాలు, వేలం ప్రక్రియపై సమగ్ర సమాచారం అందించడమే సమావేశం ఉద్దేశమన్నారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌తో కలిసి పారదర్శక, పోటీ విధానంలో భూముల నగదీకరణ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ సీఎండీ ఎం.ఎస్.వి.ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ విశాఖలోని కీలక ప్రాంతాల్లో ఉన్న భూముల వివరాలను పెట్టుబడిదారులకు నేరుగా వివరించే అవకాశం సమావేశం ద్వారా లభించిందన్నారు. వేలం ప్రక్రియకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

**అక్టోబర్‌లో రెండు దశల్లో వేలం**

రైల్టెల్ ఈనివిదా ఈప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా ఈవేలం రెండు దశల్లో నిర్వహించనున్నారు.అక్టోబర్ 12న తొలి దశలో 243 స్థలాలకు, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వేలం జరుగుతుంది. ఇందుకు నమోదు, ధరావతు సమర్పణకు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. అక్టోబర్ 16న రెండో దశలో 216 స్థలాలకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వేలం నిర్వహిస్తారు. రెండో దశకు నమోదు, ధరావతు సమర్పణకు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. ఒక్కో వేలానికి ధరావతు మొత్తం రూ.2 లక్షలుగా నిర్ణయించారు.ఈవేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, భూముల సమాచారం, నమోదు ప్రక్రియ, నిబంధనలు అధికారిక ఈవేలం వేదికలో అందుబాటులో ఉన్నాయి.విశాఖపట్నం అనంతరం సెప్టెంబర్ 24న విజయవాడలో, సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# నేటితో జెడ్పీ పాలనకు ముగింపు



- జెడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలకు నేడు ఆత్మీయ వీడ్కోలు

**అనంతపురం సెప్టెంబర్ 23 అనంత జనశక్తి బ్యూరో:**

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పాలకవర్గ పదవీ కాలం గురువారంతో ముగియనుంది. జిల్లాల పునర్వవస్థీకరణ అనంతరం ఉమ్మడి జిల్లా రెండుగా చీలిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఉమ్మడి జిల్లాకు జెడ్పీ చైర్ పర్సన్ గా వ్యవహరించిన బోయ గిరిజమ్మ చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోనున్నారు.

**వైసీపీ పాలనలో కొత్త జిల్లాలకు జీవం**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రతి పార్లమెంట్ నియోజక వర్గాన్ని జిల్లాగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు 26 జిల్లాలు ఏర్పాటు చేయగా, తాజాగా ప్రస్తుత ప్రభుత్వం మరో రెండు జిల్లాలను ఏర్పాటు చేస్తూ మొత్తం 28 జిల్లాలుగా విభజించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా కూడా రెండుగా చీలిపోయింది. మొత్తం 63 మండలాలతో ఉన్న ఉమ్మడి జిల్లా కాస్త 31 మండలాలతో అనంతపురం జిల్లాగాను, 32 మండలాలతో శ్రీసత్యసాయి జిల్లాగా విడిపోయాయి.

**ఉమ్మడి జిల్లా పరిషత్ కు చివరి చైర్ పర్సన్ గా బోయ గిరిజమ్మకు దక్కిన అవకాశం**

ఉమ్మడి జిల్లా పాలకవర్గం గడువు గురువారంతో ముగియనుంది. ఉమ్మడి జిల్లా పరిషత్ కు చివరి చైర్ పర్సన్ గా బోయ గిరిజమ్మ చరిత్రలో నిలచిపోనున్నారు. జెడ్పీ చైర్ పర్సన్ గా బోయ గిరిజమ్మతో పాటు ఇద్దరు వైస్ చైర్మన్లు, 60 మంది జెడ్పీటీసీ సభ్యులు, మరో ఇద్దరు జెడ్పీ కోఆప్షన్ సభ్యులతో 2020 సెప్టెంబర్ 25న కొలువుదీరిన ప్రస్తుత పాలకవర్గ పదవీ కాలం ఐదేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకొని గురువారంతో ముగియనుంది. ఉమ్మడి జిల్లా పరిషత్ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. 1929 డిసెంబర్ 3న జిల్లా బోర్డు ప్రెసిడెంట్ గా తొలిసారి గుత్తి లక్ష్మీరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత వరుసగా మరో ఐదుగురు జిల్లా బోర్డు అధ్యక్షులుగా కొనసాగారు. చివరిసారిగా 1962 ఏప్రిల్ 22తో జిల్లా బోర్డు అధ్యక్షుల కాలం ముగిసింది. ఆ తరువాత 1962 ఏప్రిల్ 23న జిల్లా ప్రజా పరిషత్ లు ఆవిర్భవించి జెడ్పీ చైర్మన్ల పాలన అమలులోకి వచ్చింది. ఈ మేరకు 15 మంది చైర్మన్లు జెడ్పీని పాలించారు. మరో 16 మంది ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్ల హోదాలో జెడ్పీ పగ్గాలు చేపట్టారు. జిల్లా బోర్డు ప్రెసిడెంట్లు, జెడ్పీ చైర్మన్లు, ఐఏఎస్ పాలనతో కలుపుకొని మొత్తం 38 మంది ఉమ్మడి జిల్లా పరిషత్ ను ఏలారు. అయితే ఉమ్మడి జిల్లాకు చివరి చైర్ పర్సన్ గా బోయ గిరిజమ్మ (38వ చైర్ పర్సన్) ఐదేళ్లు ఏకధాటిగా జెడ్పీని పాలించారు.

**అనాథ జెడ్పీలో పాలకవర్గ సభ్యులకు నేడు వీడ్కోలు సభ**

ఉమ్మడి జిల్లా పరిషత్ కు 38వ జెడ్పీ చైర్ పర్సన్ గా వ్యవహరించిన బోయ గిరిజమ్మ సహా ఇద్దరు జెడ్పీ వైస్ చైర్మన్లు వేదాంతం నాగరత్నమ్మ, సుధాకర్రెడ్డి సహా 60 మంది జెడ్పీటీసీ సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యుల పదవీ కాలం గురువారంతో ముగియనున్న క్రమంలో



జెడ్పీలో పెద్ద ఎత్తున ఆత్మీయ వీడ్కోలు నిర్వహించాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ నిర్ణయించారు. ఈ మేరకు అందరికీ ఆహ్వానాలు పంపారు.

**అనంత, శ్రీ సత్యసాయి జెడ్పీలకు స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్లు ఆనంద్, శ్యామ్ ప్రసాద్**

జెడ్పీ పాలకవర్గ పదవీ కాలం గురువారంతో ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన అమలులోకి రానుంది. జెడ్పీలకు స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్లు బాధ్యతలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అనంతపురం జెడ్పీ స్పెషల్ ఆఫీసర్ గా కలెక్టర్ ఆనంద్ శుక్రవారం నుంచి పగ్గాలు చేపట్టనున్నారు. విభజిత శ్రీ సత్యసాయి జిల్లాకు అక్కడి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తారు. మళ్లీ ఎన్నికలు జరిగి, కొత్త పాలకవర్గం కొలువుదీరే దాకా కలెక్టర్లే స్పెషల్ ఆఫీసర్లుగా జెడ్పీలను పాలిస్తారు.

# మూడు మోటార్లు నడుపుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఇది నేను నోటిమాట చెప్పడం లేదు.. రాజకీయ ఆరోపణ అంతకంటే కాదు.. ఇది వాస్తవం.. ఎందుకీ ఇది ఖచ్చితంగా వాస్తవం అని నేను చెప్తున్నాను. ఉదాహరణకు మీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌నే తీసుకోండి.. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో 5 మోటార్లున్నాయి. వీటిలో అయితే ఒకటి నడుపుతున్నరు.. లేకపోతే రెండు.. ఎప్పుడైనా నేనొస్తా అంటే.. బీఆర్ఎస్ ఒత్తిడి పెడితే మూడు మోటార్లు నడుపుతున్నారు. ఈ మూడు కూడా రోజుకు 8 గంటలు మాత్రమే నడుపుతున్నరు. ఉదయం 8 :30 గంటలకు మోటార్లు ఆన్ చేస్తున్నరు.. సాయంత్రం 4 : 30 గంటలకు బంద్ చేస్తున్నరు. నడపాల్సిన మోటార్లు 5 అయితే.. నడుపుతున్నయి 3 అని అన్నారు. 24 గంటలు 5 మోటార్లు నడిపితే 4,000 క్యూసెక్కుల నీళ్లు లిఫ్ట్ చేయొచ్చు.. కానీ ఈ దద్దమ్మ ప్రభుత్వం కేవలం 800 క్యూసెక్కుల నీళ్లు మాత్రమే లిఫ్ట్ చేస్తుందని మండిపడ్డారు. అందుకే అంటున్నాము.. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు



అని.. పరిపాలన చేతకాక, ఎల్ నినో పేరు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు.

అనంత జనశక్తి
గురువారం | అనంతపురం
24.09.2026


# బిడ్డను దత్తత తీసుకుంటా..: శ్రుతి



పెళ్లి పేరుతో చేసే విలాసవంతమైన ఖర్చుల గురించి నటి శ్రుతి హాసన్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. తాను సింగిల్‌గా ఉండడంపై స్పందించారు. పెళ్లి అనేది రెండు మనసులకు సంబంధించిన విషయమన్నారు. "నాకు వివాహబంధం అంటే చాలా ఇష్టం. కానీ, పెళ్లి పేరుతో బందీగా ఉండడం నచ్చదు. కొన్ని విషయాల్లో నా సొంత ఆలోచనలకే గౌరవం ఇస్తా. పెళ్లి పేరుతో భారీగా ఖర్చు పెట్టడం, ఆడంబరంగా వేడుక చేసుకోవడం ఎందుకు?. ఎక్కవ ఖర్చు చేసేవారిని నేనేం తప్పు పట్టడం లేదు. ఒక వేడుకకు అంత ఖర్చు చేసే బదులు..

ఆ డబ్బుతో దానధర్మాలు చేయొచ్చు. ఆ దిశగా ఆలోచించడం లేదని బాధగా ఉంటుంది. వివాహ వ్యవస్థకు నేనేం వ్యతిరేకిని కాదు. నిజం చెప్పాలంటే.. ఒకసారి పెళ్లి పీటల దాక వెళ్లి వెనక్కి వచ్చాను" అని శ్రుతి హాసన్ తెలిపారు. ఇక మాతృత్వం గురించి మాట్లాడుతూ.. తనకు తల్లి కావాలని ఉందన్నారు. అందుకోసం బిడ్డను దత్తత తీసుకోవాలని ఉందని తెలిపారు.

గతంలోనూ శ్రుతి హాసన్ పెళ్లి గురించి మాట్లాడారు. తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడినట్లు చెప్పారు. ఆ గుర్తింపును పెళ్లితో ముడిపెట్టాలనే ఆలోచన

# 'జార్జ్ క్రిష్'.. శర్వానంద్‌కు జోడీగా మానస వారణాసి



కథానాయకుడు శర్వానంద్ ( సరసన అందాల భామ మానస వారణాసి ) సందడి చేయనున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'జార్జ్ క్రిష్' . ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర, అజయ్ సుంకర నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకి మానస వారణాసి కథానాయికగా ఎంపికయ్యారు. ఈ మేరకు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. పూర్తిస్థాయి వినోదాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్రం థియేటర్లలో పండుగ వాతావరణాన్ని తీసుకురానుందని మేకర్స్ తెలిపారు. శర్వానంద్, మానస వారణాసిల కొత్త జోడీ చూడముచ్చటగా ఉందని, వెండితెరపై ఈ పెయిర్ ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ థియేటర్లలో విడుదల కానుంది.

# నాకు మాయ చేయడం తెలీదు.. జాతీయ అవార్డుపై మమ్ముట్టి

'భ్రమయుగం'లో తన అద్భుతమైన నటనకు జాతీయ అవార్డు అందుకున్నారు అగ్ర కథానాయకుడు మమ్ముట్టి . ఆయన కెరీర్‌లో నాలుగోసారి నేషనల్ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఐదు దశాబ్దాల సినీ ప్రయాణం, అవార్డు గెలుచుకున్న పాత్ర వెనుక ఉన్న శ్రమ, నటనపై తన దృక్పథం గురించి మమ్ముట్టి మాట్లాడారు.

"దేశం గుర్తించడం ప్రతి కళాకారుడికి స్ఫూర్తిదాయకం. నాలుగు సార్లు ఈ పురస్కారాన్ని తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. నా దర్శకులకు, సాంకేతిక నిపుణులకు, ఇన్నేళ్లుగా అండగా నిలిచిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. భవిష్యత్తులో ఈ వేదికపై మరెన్నోసార్లు మెరవాలని ఆశిస్తున్నా. మీ కోసం ఏ కష్టమైనా పడడానికి నేను సిద్ధంగా ఉన్నాను. నేను పాత్ర కంటే కథకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను. పెద్దగా ప్రణాళికలు ఉండవు. మొదటి రోజు సెట్‌కు వెళ్లగానే ఈ సినిమా (విషయంలో ఏదో అద్భుతం జరుగుతుందని ఎవరికీ తెలీదు. నాకు ఎలాంటి మేజిక్‌లు చేయడం రాదు. నా అదృష్టం కొద్దీ నటనకు ప్రాధాన్యం ఉన్న ఇలాంటి పాత్రలు నా వద్దకు వస్తాయంతే. ఆ పాత్రలకు నేను ప్రాణం పోస్తాను. నా సుదీర్ఘ ప్రయాణంలో ఇదే జరుగుతోంది" అని మమ్ముట్టి తెలిపారు. జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందని ఆయన అన్నారు.

తాజాగా 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో మమ్ముట్టి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనతో పాటు కార్తిక్ ఆర్యన్(చందూ ఛాంపియన్) కూడా ఈ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు. దీనిపై కార్తిక్ స్పందిస్తూ.. అవార్డు, తన తల్లిదండ్రులతో ఉన్న ఫొటోను పంచుకున్నారు. దానికి 'నా ప్రపంచం' అనే క్యాప్షన్ పెట్టారు.




# ఆసియా గేమ్స్.. భారత్‌ను ఇబ్బంది పెడుతున్న రూల్స్?

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుతంగా పోరాడుతున్నా.. అక్కడి రూల్స్ మాత్రం ఇబ్బంది పెడుతున్నాయి. అనుకున్న పతకాలను దూరం చేస్తూ నిరాశకు గురిచేస్తున్నాయి. మొన్నేమో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సుచిక ఫైనల్ చేరుకోలేక కాంస్యంతోనే సరిపెట్టుకొంది. మళ్లీ ఇప్పుడు ఈ-ఫుట్‌బాల్ విభాగంలో 'రూల్' దెబ్బకు ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది.

భారత్ ఈ-స్పోర్ట్స్ జట్టు ప్రయాణం అత్యంత నిరాశాజనకంగా ముగిసింది. ఈ-ఫుట్‌బాల్ క్రీడలో గ్రూప్- ఎఫ్ నుంచి భారత్ బరిలోకి దిగింది. తన చివరి మ్యాచ్ కోసం మైదానంలోకి అడుగు పెట్టకుండానే విజయం సాధించింది. కానీ, అదే ఇప్పుడు భారత్ నిష్క్రమణకు కారణమైంది. మరి ఆసియా గేమ్స్ రూల్ ఆ విధంగానే ఉండటం గమనార్హం. డానియల్ పటేల్ - చిన్మయ్ సాహూ జోడీ చివరి మ్యాచ్ కోసం సిద్ధమైంది. కానీ, ప్రత్యర్థి మంగోలియా నిర్దేశించిన చెక్ ఇన్ సమయానికి చేరుకోకపోవడంతో 0-0తేడాతో భారత్‌కు వాకోవర్ విజయం లభించింది. గెలిచాం కదా! ఇంకేం.. ముందుకు వెళ్లొచ్చని భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఈ ఫలితంతో తదుపరి రౌండ్లకు వెళ్లేందుకు అవసరమైన గోల్స్‌ను సాధించలేకపోయింది. దీంతో గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది.

రూల్ అలా ఉంది మరి..

అయితే, ఈ విజయం తమకు అవసరం లేదని భారత జట్టు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. తాము బరిలోకి దిగుతామని కోరింది. కానీ, నిబంధన ప్రకారం.. ప్రత్యర్థి టీమ్ రాకపోతే వాకోవర్ ఇవ్వాల్సిందే. అధికారులు ఆ మేరకు భారత జట్టును విజేతగా ప్రకటించారు. కానీ, గోల్స్ తేడానే ప్రధాన సమస్యగా మారింది. అర్హత పోటీలో నిలవాలంటే భారత్‌కు భిన్నమైన వాకోవర్ స్కోరు అవసరమయ్యేదని పటేల్ అన్నారు.

చెదిరిన కల..

కనీసం గ్రూప్ స్టేజ్ దాటకుండానే వెనుదిరగడం భారత్ తీవ్ర నిరాశపరిచింది. మరీ ముఖ్యంగా డానియల్ పటేల్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఫిఫా కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో టైటిల్ గెలుచుకున్నాడు. ఆసియన్ ఈ-ఫుట్‌బాల్ మొబైల్ ఛాంపియన్‌గా ఇప్పుడు అడుగు పెట్టాడు. ఆసియా క్రీడల్లో పతకం సాధించి ఉంటే అరుదైన ఘనతను సొంతం చేసుకొనేవాడు..

ఛాలెంజ్ చేయాలంటే..

సాధారణంగా రివ్యూలు తీసుకొని సమీక్షించాలని కోరడం ఉంటుంది. కానీ, ఆసియా క్రీడల్లో ఫలితాన్ని ఛాలెంజ్ చేయాలంటే డబ్బులు చెల్లించాలి. ఈ-ఫుట్‌బాల్ జట్టు కూడా 500 డాలర్లను చెల్లిస్తేనే ఫార్మల్ రివ్యూ చేసేందుకు అవకాశం ఉంది. కానీ, గోల్ వ్యత్యాసం ఉండటంతో భారత్ ఆ దిశగా ఆలోచించలేదు. కానీ, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అథ్లెట్ సుచిక కూడా 1000 డాలర్లు చెల్లించి మరీ రివ్యూ తీసుకుంది. అందులో ఆమె సక్సెస్ అయినా.. ఆసియా గేమ్స్ రూల్స్ ప్రకారం తన ప్రత్యర్థి కంటే ఎక్కువ బరువు ఉండటంతో సెమీస్‌లోనే నిష్క్రమించింది.




# అప్పుడు మల్లీశ్వరి.. ఇప్పుడు మీరాబాయి: ఆసియా గేమ్స్‌లో 28ఏళ్ల 'వెయిట్' ఓవర్



ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ మెడల్ కోసం భారత సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 28 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో మన వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు పతకం సాధించింది. జపాన్ వేదికగా జరుగుతోన్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 49కేజీల విభాగంలో ఆమె రజతాన్ని ముద్దాడింది. అంతేకాదు.. ఆసియా క్రీడల్లో మెడల్ రాలేదన్న వెలితి కూడా చానుకు ఇప్పుడు తీరిపోయింది.

బుధవారం జరిగిన పోటీల్లో మీరాబాయి చాను స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 111 కేజీలు ఎత్తింది. మొత్తంగా 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన ఉత్తరకొరియా వెయిట్‌లిఫ్టర్ రి సాంగ్ గమ్.. రికార్డు స్థాయిలో మొత్తం 215 కేజీలు (స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 121 కిలోలు) ఎత్తి బంగారు పతకం సాధించింది. ఆసియా గేమ్స్ లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత్ కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. చివరిసారిగా 1998లో జరిగిన ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి రజతం సాధించింది. ఇక, ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ ఇలా అంతర్జాతీయ

టోర్నీల్లో అనేక పతకాలు సాధించినా.. ఆసియా క్రీడల్లో మాత్రం ఆమె ఇప్పటివరకు మెడల్ తీసుకోలేదు. నేటితో ఆ కొరత తీరింది. మీరాబాయి చాను గతంలో టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు, కామన్వెల్త్ గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజత పతకాలను సాధించిన సంగతి తెలిసిందే.

మోదీ అభినందనలు

ఆసియా గేమ్స్‌లో పతకం నెగ్గిన మీరాబాయి చానుకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా అభినందలు తెలియజేశారు. ఇది ప్రత్యేకమైన రజతం అని

అన్నారు. ఆట పట్ల ఆమెకున్న అంకితభావం ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోం దని ప్రశంసించారు. చాను ఈ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు

సాధించాలని ఆకాంక్షించారు.

# స్కీట్‌లో భారత్‌కు డబుల్ మెడల్స్.. మను బాకర్ మిస్



ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. బుధవారం రెండు ఈవెంట్లలో మెడల్స్ దక్కాయి. స్కీట్ టీమ్ విభాగంలో భారత మహిళ, పురుష జట్లు కాంస్యం దక్కించుకున్నాయి. అటు భారత స్టార్ షూటర్ మను బాకర్ నిరాశకు గురిచేసింది.

మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రైజా దిల్లాన్, మహేశ్వరి చౌహన్, పరినాజ్ ధలీవాల్.. 331 స్కోరుతో మూడో స్థానంలో నిలిచారు. దీంతో కాంస్యం దక్కింది. ఈ ఈవెంట్‌లో చైనా బృందానికి బంగారు పతకం రాగా.. కజకిస్థాన్ టీమ్ రజతం గెలిచింది.

ఇక, పురుషుల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, భవతేగ్ సింగ్ గిల్, మైరాజ్ అహ్మాద్ ఖాన్.. 346 స్కోరుతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించారు. మరోవైపు, వ్యక్తిగత విభాగంలో అనంత్‌జీత్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఒలింపిక్‌లో డబుల్ మెడల్స్‌తో ఆకట్టుకున్న మనుబాకర్‌కు.. ఆసియా గేమ్స్‌లో నిరాశ ఎదురైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కొద్దిలో ఆమె పతకం చేజార్చుకుంది. ఫైనల్ పోరులో 181.1 స్కోరుతో మను ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్ల బృందం కాంస్యాన్ని త్రుటిలో మిస్ అయ్యింది.

అటు సాఫ్ట్ టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు జై మీనాకు కాంస్యం దక్కింది. సెమీస్‌లో జపాన్ క్రీడాకారుడి చేతిలో జై 2-4తో ఓటమిపాలయ్యాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314